J/NELLORE/003/24-26 R.N.I.No.25359/74 పేజీలు : 12

THE BEST TELUGU WEEKLY OF NELLOREANS




# లాయర్

సంపుటి : 44 సంచిక : 3 21.06.2024, శుక్రవారం వెల : రూ. 5 /- వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంపాదకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి

● ఆంధ్రాలో దశాబ్ద కాలంగా..

## కనిపించని అభివృద్ధి ఆనవాళ్ళు..

# కొత్త ప్రభుత్వానికి పెనుసవాళ్ళు!



### ‘ప్రత్యేకహోదా’ సాధనకు ఇదే మంచి తరుణం

తెలంగాణ నుండి ఆంధ్ర విడిపోయి అనాధాంధ్రగా అవతరించి పదేళ్లు గడిచిపోయింది.

ఉమ్మడి రాజధానిగా హైదరాబాదు ఉంటుందన్న పదేళ్ల గడువు కూడా అయిపొయింది.

ఈ పదేళ్లలో ఆంధ్రాలో....

శాశ్వత రాజధాని ఏర్పడలేదు.

శాశ్వత సచివాలయం కట్టలేదు.

రాష్ట్రానికి ప్రత్యేకహోదా రాలేదు.

శాశ్వత అసెంబ్లీ భవనం నిర్మాణం జరగలేదు.

పెండింగులో ఉన్న పోలవరం పూర్తి కాలేదు.

కొత్తగా నీటిపారుదల ప్రాజెక్టు ఒక్కటి కూడా రాలేదు. చెప్పుకోదగ్గ స్థాయిలో ఒక్క పరిశ్రమ కూడా ప్రారంభింపబడలేదు.

### 2014 నుండి 2019 వరకూ..!

రాష్ట్రం విడిపోయిన తొలి ఐదేళ్ళలో చంద్రబాబు ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. పదేళ్ళు ఉమ్మడి రాజధానిగా హైదరాబాదు ఉందన్న సంగతి విస్మరించింది. రాత్రికి రాత్రే రాజధానిని ఏర్పాటు చేయాలన్న తపనతో తప్పటడుగులు వేసింది. తాత్కాలిక కట్టడాలతో కాలయాపన చేసింది. కొత్త రాష్ట్రాన్ని ఎలా అభివృద్ధి చేయాలి...? అన్న ఆలోచనతోనే ఐదేళ్లు కాలక్షేపం చేసేసింది. రాజమౌళి గ్రాఫిక్స్, సింగపూర్ ఆర్కిటెక్టుల హైటెక్కు నమూనాలను జనానికి చూపించి భవిష్యత్తులో తాము చేయబోయే అభివృద్ధి ఇలా ఉంటుందని చెప్పి 2014 నుండి 2019 వరకూ సమయాన్ని సాగదీసి దిగిపోయింది.

### 2019 నుండి 2024 వరకూ...!

బాబు వైఫల్యాలని ఎత్తి చూపుతూ జగన్‌మోహన్ రెడ్డి ప్రజాక్షేత్రంలో తిరిగాడు. ఒక్క అవకాశం ఇస్తే తన ప్రతిభ చూపిస్తానన్నాడు. యువకుడు, రాజశేఖర రెడ్డి వారసుడు, విద్యావంతుడు, వివేకవంతుడు రాష్ట్రాన్ని అభివృద్ధి బాటలో నడిపిస్తాడు అని ప్రజలు భావించారు.

ఆ ఆశతోనే 2019 ఎన్నికలలో 151 సీట్లతో జగన్ ప్రభుత్వాన్ని గెలిపించారు. వచ్చిన కొద్ది రోజుల నుండే ఆయనా... ఆయన బృందం కూల్చి వేతలు, కక్ష సాధింపులు, దాడులు, దోపిడీలతో పాలన మొదలుపెట్టారు. కొండలు గుట్టలు తవ్వేశారు. ఇసుక, మద్యం, మైనింగ్ వంటి అన్ని రంగాలతో పాటు ఇతర అన్ని వ్యవస్థలన్నీ నిర్వీర్యం చేసేశారు. దోపిడీకి కాదేది అనర్హం అన్నట్లుగా దొరికిన చోటల్లా దోచుకున్నారు. రాష్ట్రాన్ని అభివృద్ధిలో పరుగులు పెట్టిస్తారనుకున్న రాష్ట్ర ప్రజల

10లో



1930 - 2024

అశ్రునివాళి

గురుః బ్రహ్మ గురుః విష్ణు । గురుదేవో మహేశ్వరః
గురుస్సాక్షాత్ పరబ్రహ్మ । తస్మై శ్రీ గురవేనమః

వీ.ఆర్.కళాశాల విశ్రాంత ఆంగ్ల బోధకులు

శ్రీ వీ.ఎస్.రామచంద్రరావు గారు

వారి దివ్యస్మృతికి నా నమస్సుమాంజలి.

“తెలుగు భాషని అమితంగా అభిమానించే నన్ను ఆంగ్ల భాష పట్ల కూడా ఆకర్షితుడిని చేసిన ఘనత మా గురుదేవులు రామచంద్రరావు గారిది.”

– వరప్రసాద్

వారి ఆత్మోద్ధరణకై ప్రార్థిస్తూ...

డాక్టర్ వరప్రసాద్‌రెడ్డి

వ్యవస్థాపక ఛైర్మెన్, శాంతా బయోటెక్నిక్స్



# విద్యా వ్యవస్థకు.. ఇక మంచి రోజులు

**- కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి**

రాష్ట్రంలో విద్యా వ్యవస్థకు ఇక అవస్థలు తీరిపోయి మంచి రోజులు రానున్నాయని కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు చెప్పారు. ఇటీవల ఆయన కందుకూరులోని జడ్పీ బాలికల హైస్కూల్ విద్యార్థినులకు విద్యాసామగ్రి కిట్‌లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రబాబు పాలన అన్నివిధాలా అభివృద్ధికరంగా ఉంటుందన్నారు. యువనేత నారా లోకేష్ ఆధ్వర్యంలో విద్యాశాఖలో విప్లవాత్మక మార్పులు వస్తాయన్నారు. విద్యావ్యవస్థను బాగుచేసేందుకు చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి కాగానే మెగా డీఎస్సీపై తొలి సంతకం చేయడం చరిత్రాత్మకమని, తద్వారా 16వేల ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి తెలుగుదేశం ప్రభుత్వం చర్యలు తీసుకుం టోందని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఉత్తీర్ణత శాతం బాగా పెరిగేలా ఉపాధ్యాయులు దృష్టి సారించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డెప్యూటి ఇఓ ప్రసాద్‌రావు, ఎంఇఓ సుబ్బారెడ్డి, హైస్కూల్ ప్రధానోపాధ్యాయని ద్వారకారాణి తదితరులు పాల్గొన్నారు.

# రక్తదాతలకు ఘనంగా సన్మానాలు



ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా ఇటీవల నెల్లూరు రెడ్ క్రాస్ జిల్లా కార్యాలయంలో రెడ్ క్రాస్ ఛైర్మెన్, ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో, అత్యధిక సార్లు రక్తం ఇచ్చిన 59 మంది దాతలను గుర్తించి వారికి జ్ఞాపికలు, సర్టిఫికెట్లు అందజేసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పర్వతరెడ్డి మాట్లాడుతూ, రక్తదానం ఆవశ్యకతను వివరించారు. ప్రతి ఒక్కరూ రక్తదానం చేసి బాధితులను, రోగులను ఆదుకోవాలన్నారు. ఏటా దాదాపు 15 వేల యూనిట్ల రక్తాన్ని సేకరిస్తూ నెల్లూరు రెడ్ క్రాస్ బ్లడ్‌బ్యాంక్ రాష్ట్రంలోనే మొదటి స్థానంలో ఉం దని, దానిని ఆధునీకరించి అన్ని వసతులతో బ్లడ్ బ్యాంకును అందుబాటులోకి తీసుకొచ్చా మని చెప్పారు. త్వరలో నెల్లూరు రెడ్ క్రాస్‌లో 20 పడకల తలసేమియా క్లినిక్‌ను కూడా అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. ఈ కార్యక్రమంలో రెడ్ క్రాస్ వైస్ ఛైర్మెన్ దామిసెట్టి సుధీర్ నాయుడు, మేనేజింగ్ కమిటీ సభ్యులు ఎంవి సుబ్బారెడ్డి, మలిరెడ్డి కోటారెడ్డి, గంధం ప్రసన్నాంజనేయులు, రవిప్రకాష్, సురేష్ కుమార్‌జైన్, కలికి శ్రీహరిరెడ్డి, దాసరి రాజేంద్రప్రసాద్, రంగయ్యనాయుడు, గునపాటి ప్రసాద్, వాకాటి విజయ్ కుమార్‌రెడ్డి, బ్లడ్ బ్యాంక్ కన్వీనర్ అజయ్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

# నీళ్ళ కోసం రోడ్డెక్కిన కాగితాలపూరు గ్రామస్తులు



మనుబోలు మండలం, కాగితాలపూరు గ్రామంలోని దళితవాడలో గత కొద్దిరోజు లుగా విద్యుత్ సక్రమంగా లేకపోవడంతో కుళాయిల్లో నీళ్లు రాక ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. అధికారులెవరూ పట్టించుకోకపోవడంతో గ్రామస్తులు ఇటీవల రోడ్డెక్కి ఆందోళన చేపట్టారు. మహిళలు ఖాళీ కుండలు, బిందెలతో నిరసన వ్యక్తం చేశారు. దళితవాడలో సుమారు వంద కుటుంబాలకుపైగా ప్రజలు తాగేందుకు నీళ్ల లేక ఇబ్బందులు పడుతున్నా సంబంధిత సిబ్బంది కానీ, అధికారులు కానీ తమ బాధలు పట్టించుకోవడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. కనీసం కాలనీలో కుళాయిలకు ప్రత్యామ్నాయంగా చిన్న బోరు కూడా లేకపోవడంతో విద్యుత్ సరఫరా లేనప్పుడల్లా అవస్థలు పడాల్సివస్తోందని, జిల్లా ఉన్నతాధికారులైనా తమ కష్టాలను పరిశీలించి మంచినీటి సరఫరా పునరుద్ధరణకు తక్షణ చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

# త్వరలోనే 'అన్న'ం క్యాంటీన్లు

- **పేదలకు 5 రూపాయలకే మంచి భోజనం**
- **మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ**

నెల్లూరు నగరంలో త్వరలోనే 'అన్న' క్యాంటీన్లు ఏర్పాటు చేస్తామని, పేదలం దరికీ 5 రూపాయలకే మంచి భోజనం పెడతామని, అందుకు అన్ని ఏర్పాట్లు ముమ్మరంగా జరుగుతున్నాయని రాష్ట్ర పురపాలకశాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ చెప్పారు. ఇటీవల ఆయన నెల్లూరులోని మద్రాసు బస్టాండ్, స్టోన్ హౌస్‌పేట, బృందావనం ప్రాంతాల్లో ఉన్న అన్న క్యాంటీన్లను సందర్శించి, ఏర్పా ట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో 2014–19 సంవత్స రాల్లో అన్న క్యాంటీన్ల ద్వారా రోజుకు



2.25 లక్షల మంది పేదలకు రుచికరమైన, శుచికరమైన భోజనం పెట్టడం జరిగిందని గుర్తుచేశారు. ఇప్పుడు కూడా చంద్రబాబు నాయుడు తాను ముఖ్యమంత్రి అయిన వెంటనే నిరుపేదల ఆకలి తీర్చడం కోసం అన్న క్యాంటీన్లను వెంటనే పునఃప్రారంభిం చాలని ఆదేశించారన్నారు. ఎక్కడ నిరు పేదలు అధికసంఖ్యలో ఉంటారో ఆ ప్రాం తాల్లోనే ప్రధానంగా అన్న క్యాంటీన్లలను ఏర్పాటుచేస్తున్నామని, నెల్లూరులో పేదల కోసం మంచి భోజనం పెట్టేలా ఇస్కాన్‌సిటీ చారిటబుల్ ట్రస్ట్‌కి ఆ బాధ్యతలు అప్పగిం చామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మంత్రి నారాయణ వెంట టీడీపీ నాయ కులు అబ్దుల్ అజీజ్, కోటంరెడ్డి శ్రీనివా సులురెడ్డి, రూప్‌కుమార్‌యాదవ్, తాళ్ళపాక అనూరాధ, భానుశ్రీ, మామిడాల మధు తదితరులు పాల్గొన్నారు.

## మనుబోలులో
# ఉచిత యోగా తరగతులు

మండలకేంద్రమైన మనుబోలులో ఇటీవల యోగా తరగతులు ప్రారంభమ య్యాయి. అంతర్జాతీయ యోగా దినోత్స వాన్ని పురస్కరించుకుని స్థానిక హరిక నేత్రవైద్యశాల వారి సౌజన్యంతో ఉచిత యోగా శిక్షణ ఇస్తున్నారు. ఈ సందర్భంగా ప్రముఖ యోగా శిక్షకులు కోటేశ్వరరెడ్డి మాట్లాడుతూ, యోగాతో మానసిక వికా సంతో పాటు శారీరక దృఢత్వం ఏర్పడు తుందని, యోగా వల్ల అనేక రకాల వ్యాధు లను దూరం చేసుకోవచ్చని తెలిపారు. ప్రతిరోజు ఉదయం 5.30 నుంచి 6.30 గంటల వరకు మనుబోలు హైస్కూలులో జరిగే ఈ యోగా శిక్షణను ప్రజలు సద్విని యోగం చేసుకోవాలని ఆయన కోరారు.

## రైతులకు
# పండ్ల మొక్కలు సిద్ధం

మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి పథకం కింద 2023–24 ఆర్థిక సంవత్సరానికి రైతులకు పండ్ల మొక్కలు పంపిణీ చేసేందుకు సిద్ధంగా ఉన్నామని రాపూరు ఏపీఓ సుబ్బరాయుడు తెలిపారు. నిమ్మ, జామ, మామిడి తదితర పండ్ల మొక్కలు సాగు చేసుకునే సన్న, చిన్నకారు రైతులు మొక్కల కోసం దరఖాస్తు చేసు కోవచ్చన్నారు. రైతులు తమ పట్టాదారు పాసుపుస్తకం, 1బి అడంగల్, సన్నకారు రైతు సర్టిఫికెట్, బ్యాంకు అకౌంట్, ఆధార్‌కార్డు, జాబ్‌కార్డు జెరాక్స్ కాపీలను ఉపాధి హామీ కార్యాలయంలో అందజే యాలని ఆయన సూచించారు.

## శ్రీనాథరెడ్డికి
# రక్తదాత అవార్డు



జలదంకికి చెందిన వడ్డే శ్రీనాథ్‌రెడ్డి, ఇటీవల నెల్లూరులో జరిగిన రెడ్‌క్రాస్ సమావేశంలో రక్తదాత అవార్డును అందు కున్నారు. కరోనా సమయంలో రెండుసార్లు ప్లాస్మా దానం, ఇప్పటిదాకా మొత్తం 37సార్లు రక్తదానం చేయడంతో ఆయనకు జిల్లా రెడ్‌క్రాస్ ప్రతినిధులు అవార్డునిచ్చారు.

# తల్లీబిడ్డల క్షేమం కోసం..'మదర్ కేర్ యూనిట్'

**ప్రారంభించిన 'రిచ్' ఆసుపత్రి అధినేత డాక్టర్ రవికుమార్**



జిల్లాలో మాతా శిశుమరణాలు తగ్గించాలనే ధ్యేయంతో, తల్లీబిడ్డల క్షేమం కోసం నెల్లూరులోని వసంతలక్ష్మి చారిటబుల్ ట్రస్ట్, ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్‌ల సంయుక్త ఆధ్వర్యంలో ఇటీవల 'కంగారు మదర్ కేర్ యూనిట్'ను ఏర్పాటుచేశారు. 'రిచ్' ఆసుపత్రి అధినేత డాక్టర్ రవికుమార్ ఈ యూనిట్‌కు ప్రారంభోత్సవం చేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఏర్పాటుచేసిన ప్రత్యేక అంబులెన్స్ వాహనంలో వెంటిలేటర్లు, మానిటర్స్, స్కానింగ్ మిషన్ తదితర వైద్య సామగ్రితో పాటు, నిపుణులైన వైద్యసిబ్బంది, ఇద్దరు గైనకాలజిస్టులు అందుబాటులో ఉంటారని ఆయన ఈ సందర్భంగా చెప్పారు. గర్భిణులకు అవసరమైన వైద్యపరీక్షలు, స్కానింగ్ అన్నీ పూర్తిస్థాయిలో ఉచితంగా అందిస్తారని, ఈ వాహనంలో అన్ని గ్రామాలకు వెళ్లి స్థానికంగా ఉండే ఆశావర్కర్లు, వైద్యసిబ్బందికి తగు శిక్షణ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. అనుభవజ్ఞులైన వైద్యసిబ్బంది ద్వారా గర్భిణులకు, తల్లులకు ఆరోగ్యపరిరక్షణ పట్ల, బిడ్డల పెంపకం పట్ల అవగాహన కలిగిస్తారన్నారు. జిల్లాప్రజలు ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ రీటెయిల్ హెడ్ ఏ.వి అనిల్‌కుమార్, రీటెయిల్ మేనేజర్ డి. నరేష్‌కుమార్, వసంతలక్ష్మి చారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధులు పాల్గొన్నారు.

# చిన్నారులను పనిలో పెట్టుకుంటే.. కఠినచర్యలు

**ఉప కార్మిక కమిషనర్ వెంకటేశ్వర్లు**




బాల కార్మిక వ్యవస్థ నిర్మూ లన కోసం ప్రతిఒక్కరూ సహక రించాలని, ఎవరైనా చిన్నారులను పనిలో పెట్టుకుంటే కఠిన చర్యలు తప్పవని ఉప కార్మిక కమిషనర్ వెంకటేశ్వర్లు హెచ్చరించారు. బాల కార్మిక వ్యవస్థను నిరోధించా లంటూ ఆయన ఇటీవల నెల్లూరులో ప్రచారం నిర్వహించారు. సంయుక్త కార్మిక కమిషనర్ శ్రీనివాసకుమార్‌తో పాటు పలువురు అధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# వారపత్రికలకి గుర్తింపు లేదు

## వీఐపీల పర్యటనలతో పాటు ఎన్నికల పాసు పొందే అర్హతా వాటికి లేదు

### జిల్లా సమాచార శాఖాధికారి కొత్త భాష్యం..!

### చిన్న పత్రికలపై సమాచార శాఖ చిన్నచూపు..!!

ఇదో విచిత్రమైన పరిణామం. ప్రభుత్వ అధికారులుగా బాధ్యతలు చేపట్టి సేవలందిస్తున్న వారి ప్రతిభా నైపుణ్యాన్ని, విధివిధానాల పట్ల వారికున్న అవగాహనా రాహిత్యాన్ని బయటపెట్టే అరుదైన సంఘటన. కవి తిక్కన కలం పట్టిన గడ్డపైన, పెన్నా నది నీళ్లలోని తియ్యదనంతో సమానంగా, అక్షరంలోని మాధుర్యాన్ని ఆస్వాదిస్తూ, సాహిత్య సేవలో తరిస్తున్న సింహపురి నేలపై అక్షర సేద్యం చేస్తున్న స్థానిక పత్రికా రంగానికి జరుగుతున్న ఘోర అవమానం. స్థానిక పత్రికలకి పుట్టినిల్లుగా ప్రసిద్ధి చెందిన నెల్లూరుజిల్లాలో ఇలాంటి సంఘటన జరగడం అత్యంత బాధాకరం. దశాబ్దాలుగా వస్తున్న ఆచారాన్ని అవగాహనా లోపంతో తుంగలో తొక్కడం ఆ సమాచార శాఖాధికారికే దక్కింది. అక్రిడిటేషన్ కార్డుల విషయంలో సైతం స్థానిక పత్రికలపైన సవతి ప్రేమ చూపిస్తున్నారు. గతంలో 4కార్డులు వున్న స్థానిక పత్రికల అక్రిడిటేషన్ కార్డుల సంఖ్యని 2019 తరువాత 1కి కుదించేశారు. అదేమంటే అది కూడా జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ పాలసీ అంటూ నెపం ఆయనపై తోసేస్తున్నారు.

పీరియాడికల్(వార, పక్ష, మాస) పత్రికలకి ప్రాధాన్యత ఇవ్వొద్దని తమకి ఆదేశాలున్నాయని బుకాయిస్తున్నారు. ఆ ఆదేశాలు ఎవరిచ్చారో చెప్పండి, అలా లిఖిత పూర్వకంగా ఉంటే చూపండి అంటే ఖచ్చితమైన సమాధానం ఇవ్వలేకపో తున్నారు. జిల్లా కలెక్టర్ చెప్పారని ఒకసారి, సమాచార శాఖ కమిషనర్ ఆదేశించారని ఇంకోసారి, ఎన్నికల కమిషన్ నిబంధన అని మరోసారి ఇలా పొంతనలేని సమా ధానాలతో తప్పించుకుంటున్నారు.

### గవర్నర్ కార్యక్రమానికి నో ఎంట్రీ!

కొన్ని వారాల క్రితం 2024 మే 22వ తేదీన నగరంలోని విక్రమసింహపురి విశ్వవిద్యాలయంలో స్నాతకోత్సవ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమ కవరేజ్ కోసం మీడియా పాసులున్న వారిని మాత్రమే అధికారులు అనుమతించారు. ఆ కార్యక్రమానికి కూడా ఈ సమాచార శాఖాధికారి స్థానిక పత్రికలకి పాసులు ఇవ్వలేదు. ఇదేంటి సారూ అని అడిగితే, పీరియాడికల్స్‌కి నో ఎంట్రీ. మీకు మేమే సమాచారం పంపిస్తాం రాసుకోండి అంటూ దురుసుగా సమాధానం ఇచ్చారు.

### ఎన్నికల పాసులకి కూడా పంగనామం!

తాజాగా జరిగిన సార్వత్రిక ఎన్నికల విధులకు కూడా స్థానిక పత్రికలని ఈ అధికారి దూరం చేశారు. ఉదాహరణకి మన 'లాయర్' పత్రిక పుట్టిన 43 సంవత్స రాలలో పత్రికని విఐపిల పర్యటనలకి, ఎన్నికల విధులకు అనుమతించకపోవడం ఇదే తొలిసారి. గతంలో ఎప్పుడూ ఇలా జరగలేదు, ఈసారి ఎందుకిలా..? అని ప్రశ్నిస్తే, ఆయన దగ్గర సరైన సమాధానం లేదు. అది జిల్లా పత్రికారంగం పట్ల ఆయనకున్న అవగాహన అనుకోవాలా? లేక తనకి భజన చేసే యూట్యూబ్ ఛానెళ్ళ వారి పట్ల ఆయనకున్న అభిమానమా అన్న విషయం ఆయనకే ఎరుక.

### ప్రధాన స్థానిక పత్రికలకే దిక్కులేదు...

దేశ రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి, ముఖ్యమంత్రులు సైతం నెల్లూరులోని కొన్ని స్థానిక పత్రికల ప్రాధాన్యతని, సమాజంలో వాటి ప్రాముఖ్యతని గుర్తించి స్వయంగా వచ్చి ఆ పత్రికల వార్షికోత్సవాలలో పాల్గొన్నారు. ఆ పత్రికలకి ఉన్న గుర్తింపు, ఆదరణ అలాంటిది. అలాంటి పత్రికలనే బేఖాతరు చేసిన ఆ అధికారికి ఇతర చిన్న సాధారణ పత్రికలంటే ఏ పాటి విలువ, గౌరవం ఉంటాయో ప్రత్యేకంగా చెప్ప నక్కరలేదు. స్థానిక పత్రికా రంగంలో నిబద్ధతతో, నిజాయితీతో పనిచేస్తూ దశాబ్దాల చరిత్రతో ప్రజలు, పాఠకుల ఆదరణ అందుకుంటున్న పత్రికలపై ఈ నిర్లక్ష్యం ఏమిటని ప్రశ్నించినా.. మేమింతే మీకు దిక్కున్న చోట చెప్పుకోండని ఆ అధికారి సమాధానం చెప్పడం తన బాధ్యతల పట్ల ఆయన ప్రదర్శిస్తున్న నిర్లక్ష్యానికి నిదర్శనం.

జిల్లాలో అధికారుల సభలు, సమావేశాలు, పర్యటనలు, మంత్రులు తదితర ముఖ్యులందరి కార్యక్రమాలను ప్రచురించడంలో వారపత్రికలు ఎంతో శ్రద్ధ తీసుకుంటున్నాయి. అర్హత కలిగిన సీనియర్ పాత్రికేయులు వారపత్రికల్లో పనిచేస్తున్నారు. జిల్లాకి సంబంధించిన ఎన్నో అధికార అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు తెలియజేసే వారధులుగా పలు ప్రధాన వారపత్రికలు తమ కర్తవ్యం నిర్వహిస్తున్నాయి. ఇలాంటి తరుణంలో సమాచార శాఖవారు ప్రముఖుల పర్యటనలను కవర్ చేసేందుకు, ఎన్నికల విధుల్లో పాల్గొనేందుకు అనుమతిలేదంటూ.. వారపత్రికలని కించపరచడం ఎంత దారుణమో ప్రభుత్వ పెద్దలు, జిల్లా ఉన్నతాధికారులు ఆలోచించాలి.

ప్రజలకి, ప్రభుత్వాలకి, ప్రజాప్రతినిధులకు మధ్య వారధులుగా వున్న మీడియా సంస్థల్ని ఆయా విభాగాలతో సమన్వయపరచే శాఖే సమాచార పౌరసంబంధాల శాఖ. పౌరసంబంధాల సంగతి దేవుడెరుగు, ఇలా మీడియాసంస్థలతోనే సత్సం బంధాలు కొనసాగించలేకపోవడం ఆ అధికారి సమర్థతకి, సామర్థ్యానికి తార్కాణం. ఈ సంఘటనలని, సదరు అధికారి నిర్లక్ష్య ధోరణిని రాష్ట్ర ప్రభుత్వ పెద్దల దృష్టికి తేవడంతో పాటు దేశ, రాష్ట్ర ఎన్నికల సంఘానికి కూడా ఫిర్యాదు చేయబోతోంది 'లాయర్'. ప్రజాస్వామ్యంలో నిస్వార్థంతో, నిజాయితీతో, నిబద్ధతో ఒక యజ్ఞంలా అక్షర సమరం చేస్తున్న పత్రికల పట్ల సమాచారశాఖకి చెందిన అధికారే ఇలా వ్యవహరించడం అర్థరహితం. పత్రికలకి ఉన్న హక్కులని కాలరాయడానికి ప్రయత్నం చేసిన ఇలాంటి అధికారుల విషయంలో ప్రభుత్వం తప్పక స్పందించి గుర్తింపు ఉన్న స్థానిక పత్రికలకి సముచిత స్థానం కల్పిస్తుందని ఆశిద్దాం!

### అలుపెరుగని పరిశ్రమతో..

# ఆదర్శంగా నిలవాలి

### సత్యకు వెంకయ్య శుభదీవెన





నిరంతర కృషి, పట్టుదలతో బీజేపీలో ఉన్నతమైన పదవులను పొంది, సార్వత్రిక ఎన్నికల్లో ధర్మవరం నియోజకవర్గ శాసన సభ్యునిగా విజయం సాధించి, మంత్రి పదవిని చేపట్టిన సత్యకుమార్‌యాదవ్‌కు భారత పూర్వ ఉప రాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు ఇటీవల ఓ ప్రకటనలో శుభాకాంక్షలు తెలిపారు.

'ఓ సాధారణ యువ కార్యకర్తగా జీవితాన్ని ప్రారంభించి అకుంఠిత దీక్ష, కఠోర పరిశ్రమ, స్వయంకృషితో భారతీయ జనతాపార్టీ జాతీయ కార్యదర్శిగా, దేశవ్యాప్తంగా పలు రాష్ట్రాలకు ప్రచారిగా నీ బాధ్యతలను చిత్తశుద్ధితో నిర్వహించి, శక్తిసామర్థ్యాలను నిరూపించుకున్నావ్'.. అంటూ వెంకయ్య సత్యను అభినం దించారు.

'అప్పగించిన పని పట్ల చిత్తశుద్ధి, నిబద్ధత, దీక్షా దక్షతలతో అనతికాలం లోనే ధర్మవరం నియోజకవర్గానికి శాసన సభ్యునిగా విజయాన్ని సాధించటమే కాక, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ప్రతిష్టాత్మకమైన వైద్యఆరోగ్య శాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టడం ఆనందదాయకం' అని ఆయన సంతోషం వ్యక్తం చేశారు. అంతేకాదు, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని స్వభావ సిద్ధంగా అలుపెరుగని పరిశ్రమ గావిస్తూ ప్రజలకు నిరుపమానమైన సేవలందించి ఆదర్శంగా నిలుస్తావని ఆకాంక్షిస్తున్నా'నంటూ సత్యకు ఆయన ఆశీః పూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు.

# విజయాభినందనలు



నెల్లూరు పార్లమెంటు సభ్యులుగా వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి, కోవూరు శాసనసభ్యురాలిగా వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి అఖండ విజయం సాధించిన సందర్భంగా వేమిరెడ్డి దంపతులిద్దరినీ అభినందిస్తున్న 'లాయర్' పత్రిక సంగ్రాహకుడు తుంగా శివప్రభాత్‌రెడ్డి దంపతులు.

### డాక్టర్ ప్రేమ్‌సాగర్‌రెడ్డి ఫౌండేషన్ సహకారంతో

# 'వాత్సల్య'లో ఉచిత కుట్టుశిక్షణ కేంద్రం

అమెరికాలోని డాక్టర్ ప్రేమ్‌సాగర్‌రెడ్డి ఫౌండేషన్ వారి సహకారంతో నెల్లూరులోని 'వాత్సల్య' నిరాధార బాలల హైస్కూలులో ఉచిత కుట్టు శిక్షణ కేంద్రం ఏర్పాటుచేశారు. ఒక్కో బ్యాచ్‌కి 3 నెలల కాలపరిమితిలో, 40 మందికి శిక్షణ ఇస్తామని, ఈ శిక్షణ పొందడానికి ఆసక్తివున్నవారు తమ పేర్లను ఈనెల 25వ తేదీలోగా ఆధార్‌కార్డు జెరాక్స్, 2 పాస్‌పోర్టు సైజు ఫోటోలతో స్కూల్ హెడ్మాస్టర్ వద్ద పేర్లు నమోదు చేసుకోవాలని జనహిత-వాత్సల్య కమిటీ ఒక ప్రకటనలో తెలిపింది. ఈ శిక్షణకు కావల్సిన సామగ్రిని డా.ప్రేమ్‌సాగర్‌రెడ్డి ఫౌండేషన్ వారు సమకూరుస్తారని పేర్కొంది.

# 'శివాజీ సెంటర్'లో..ఛత్రపతి శివాజీ విగ్రహం



నెల్లూరు నగరంలోని శివాజీ సెంటర్‌లో ఛత్రపతి శివాజీ విగ్రహాన్ని ప్రతిష్టించాలనే బీజేపీ వారి కల ఇన్నాళ్ళకి సాకారమైంది. హిందూ సామ్రాజ్య దినోత్సవం సందర్భాన్ని పురస్కరించుకుని ఈనెల 19న బీజేపీ రాష్ట్ర మోర్చాల సమన్వయకర్త పి.సురేంద్రరెడ్డి, రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ ప్రాంత కుటుంబ సంయోజక్ పుట్టా శేషురెడ్డి, బీజేపీ జిల్లా శాఖ అధ్యక్షుడు శీపా వంశీధర్‌రెడ్డి, పలువురు బీజేపీ నాయకులు ఛత్రపతి శివాజీ విగ్రహాన్ని ప్రతిష్టించి ఆవిష్కరించారు. ఆర్‌ఎస్‌ఎస్ నగర సంచాలక్ బయ్యా రవి, ఏవిఆర్ మోహన్‌రావు, గంగాధర్, శివాజీ ఉత్సవ కమిటీ అధ్యక్షులు బత్తిన సాయి కుమార్‌రెడ్డి, చిలకా ప్రవీణ్, శివాజీ సెంటర్ మిత్రమండలి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



లాయర్
జూన్ 21, 2024

# జీ-7 సమావేశాల్లో భారత్‌కు అపూర్వ ఆదరణ

ఇటలీలో ఇటీవల 3 రోజులపాటు జరిగిన జీ-7 దేశాల శిఖరాగ్ర సదస్సులో పాల్గొనేందుకు వెళ్ళిన ప్రధాని మోడీకి అక్కడ ఘనస్వాగతం లభించింది. భారత్‌కు అపూర్వ ఆదరణ లభించింది. ఈ సదస్సుతో పాటు జరిగిన పలు సమావేశాల్లో ప్రధానంగా ప్రధాని మోడీయే ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఈ సందర్భంగా అమెరికా, బ్రిటన్, ఇటలీ, జపాన్, ఉక్రెయిన్ దేశాధినేతలతో మోడీ సమావేశమయ్యారు. పోప్ ఫ్రాన్సిస్‌తో కలసి ఫోటోలు దిగి అందరినీ ఆకట్టుకున్నారు.

భారత ప్రధానిగా మూడవసారి పదవినధిష్టించిన నరేంద్ర మోడీ తన విదేశీ పర్యటనలు మళ్ళీ ప్రారంభించి, తొలిసారిగా ఇటలీలో పెద్దఎత్తున జరిగిన జీ-7దేశాల 50వ శిఖరాగ్ర సదస్సులో పాల్గొన్నారు. ఈ సమావేశంలో పాల్గొనాలంటూ భారత ప్రధాని మోడీని స్వయంగా ఇటలీ ప్రధాని జార్జియా మెలానీ ఆహ్వానించారు. ఒకవైపు ఉక్రెయిన్‌పై రష్యా యుద్ధం, గాజాపై ఇజ్రాయిల్ దాడులు, ఐరోపాలో పెరుగుతున్న వలసలు, కృత్రిమ మేధతో కలుగుతున్న అవస్థలు, పర్యావరణంలో పెనుమార్పులు, ప్రపంచవ్యాప్తంగా అనేక అనిశ్చిత పరిస్థితులు, ఇంకోవైపు చైనా దుందుడుకు విధానాల నేపథ్యంలో జీ-7 సదస్సు ఎంతో ప్రాధాన్యత సంతరించుకుంది. ఉక్రెయిన్ సంక్షోభానికి శాంతియుత పరిష్కార మార్గం కోసం భారత్ పూర్తిసహకారం అందిస్తుందని ప్రధాని మోడీ ఈ సదస్సులో స్పష్టం చేయడం, దౌత్యమార్గం, చర్చలే శాంతి స్థాపనకు మార్గాలని చెప్పడం అన్నిదేశాల వారినీ ఆలోచింపజేసింది. అందుకు తగ్గట్టుగా యూరోపియన్ యూనియన్ దేశాలు, ఇతర పాశ్చాత్యదేశాలు మోడీ సారధ్యంలో భారత్ ఎదుగుతుండడాన్ని స్వాగతిస్తున్నాయి.

ఆసియా-పసిఫిక్ ప్రాంతంలో చైనాకు చెక్ పెట్టేందుకు భారత్ పటిష్టం కావడం అవసరమని జీ-7 దేశాలు భావిస్తున్న తరుణంలో ఈ సమావేశం మరింత కీలకమైంది. ఈ సదస్సు ద్వారా ప్రధాని మోడీ పలు దేశాధినేతలతో భేటీ అయ్యారు. అనేక అంశాలను వారితో చర్చించారు. ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్స్కీతో, ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమాన్యువల్ మేక్రాన్, బ్రిటన్ ప్రధాని రిషి సునాక్ తదితర నాయకులతో ప్రధాని మోడీ కలసి చర్చలు జరిపారు. పోప్ ఫ్రాన్సిస్‌తో కూడా ఆత్మీయంగా కలసి చర్చించారు. భారత్‌కు రావాల్సిందిగా కూడా పోప్‌ను మోడీ ఈ సందర్భంగా ఆహ్వానించారు. ఉక్రెయిన్‌పై రష్యా దాడులు, వాటివల్ల జరుగుతున్న నష్టాలపై ప్రధాన చర్చలు జరిగాయి. ఉక్రెయిన్‌పై దాడులు చేస్తున్న రష్యాకు చైనా పరోక్షంగా మద్దతుగా ఉంటోందని చైనా విధానాలను నిరసించడమే కాక, ఉక్రెయిన్‌కు 5వేల కోట్ల డాలర్ల ఆర్థిక సాయం అందించడానికి ఈ సదస్సులో నిర్ణయించడం మరో సంచలనం. ఈ సదస్సులో భాగంగా, ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్స్కీని కలసిన మోడీ, శాంతి స్థాపనకు కృషిచేస్తామని హామీ ఇవ్వడం ప్రపంచదేశాలకు ఊరటనిచ్చినట్లయింది. అంతేకాదు, పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతిఒక్కరూ మొక్కలు నాటాలని, దానిని ఒక నినాదంగా కాక, ఒక మహోద్యమంగా..సామాజిక బాధ్యతగా చేపట్టాలని ప్రధాని మోడీ ప్రపంచదేశాలకు పిలుపునివ్వడం అందరినీ ఆకర్షించింది. ఈ సందర్భంగా ప్రధాని మోడీ మాట్లాడుతూ, ఆధునిక సాంకేతికరంగంలో గుత్తాధిపత్యానికి తెరదించాలంటూ అంతర్జాతీయ సమాజానికి పిలుపునివ్వడం, సాంకేతికత అందరికీ అందుబాటులో ఉండాలని, అది అందరికీ మేలు చేసేవిధంగా ఉండాలని, అప్పుడే అసమానతల నిర్మూలన సాధ్యమవుతుందని చెప్పడం ప్రపంచ ప్రజలను బాగా ఆకట్టుకుంది.

ఈ సదస్సు జరిగాక, జీ-7గా ఉన్న అమెరికా, కెనడా, బ్రిటన్, ఫ్రాన్స్, జర్మనీ, ఇటలీ, జపాన్ దేశాల సరసన భారత్ కూడా చేరేందుకు తగిన సమయం కూడా వచ్చిందని విశ్లేషకులు భావిస్తున్నారు. అందులోనూ, ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశం.. భారత్! ప్రపంచశాంతి కోసం తపించే దేశం భారత్! ప్రపంచంలోని అతిపెద్ద ఆర్థికవ్యవస్థల్లో ఒకటిగా భారత్ ముందుకు వస్తున్న నేటి పరిస్థితుల్లో జీ-7 దేశాల కూటమిలో భారత్‌కు కూడా త్వరలోనే చోటు దక్కుతుందని అందరూ ఆశిస్తున్నారు. భారత్‌తో పాటు ఆస్ట్రేలియా, దక్షిణ కొరియాలను కూడా కలుపుకుని జీ-7ను 'జీ-10'గా విస్తరించుకోవడం మంచిదనే ఆలోచనలూ ఆయా దేశాల్లో వస్తున్నాయి. కనుక, భవిష్యత్‌లో వీలైనంత త్వరలోనే అది కూడా సాకారం కావచ్చని భావిస్తున్నారు. పపంచవ్యాప్తంగా ఎన్నో సమస్యల సవాళ్ళు, సంక్షోభాలు ఉన్నప్పటికీ వెరవకుండా వాటిని అధిగమించాలనే మోడీ మాటలు అందరికీ భరోసానిస్తున్నాయి. ఏదేమైనా, మోడీ ఇటలీ పర్యటన ఆద్యంతం ఫలవంతమైనట్లే!.. దిగ్విజయంగా సాగినట్లే..!

# అనుభవాల నుండి పాఠాలు నేర్చుకోవాలి!

ఈ-మెయిల్
ప్రజావాణి
lawyerpatrika@gmail.com
WhatsApp +91 98663 14741

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఎంపికలో తాజాగా ప్రజలు ఇచ్చిన తీర్పు సముచితమైందని నా అభిప్రాయం. ఓటుకు నోటు అమ్ముకునే స్థాయికి ప్రజలు దిగజారిపోయారని విమర్శించేవారికీ , డబ్బులిస్తే తోక ఉపుకుంటూ మనకే ఓటేస్తారులే అని భావించేవారికీ చెంపపెట్టులా ఈ ఎన్నికలలో ప్రజలు తమ నిర్ణయాన్ని తెలిపారు. దేశంలో కాశ్మీరు నుండి కన్యాకుమారి వరకు, మన రాష్ట్రంలో తడ నుండి ఇచ్ఛాపురం వరకూ ఈ ఎన్నికలలో ఓటరు మనోగతాన్ని గుర్తించడంలో తొలిసారిగా రాజకీయ పార్టీలు, నాయకులతో పాటు సర్వే సంస్థలు కూడా విఫలమయ్యాయి. తమకు 400 సీట్లకిపైగా వస్తాయనుకున్న బీజేపీకి భారతీయ ఓటర్లు 240 సీట్లిచ్చి సరిపెట్టారు. వై నాట్ 175 అన్న జగన్ మోహన్‌రెడ్డిని కేవలం 11 స్థానాలకే పరిమితం చేశారు.

నాయకుల ప్రవర్తనని, పనితీరుని ప్రజలు బాగా గమనిస్తున్నారనడానికి ఈ ఎన్నికలలో వచ్చిన ఫలితాలే పెద్ద నిదర్శనం. అటు కేంద్రంలోనూ ఇటు రాష్ట్రంలోనూ తమకి తిరుగులేదని విర్రవీగిన నేతల అహంకారానికి జనం అడ్డుకట్ట వేశారు. చావుతప్పి కన్ను లొట్టపోయి బయటపడ్డ బీజేపీ, తమకి ప్రతిపక్షం కూడా లేదని కాలర్ ఎగరేస్తున్న టీడీపీ గతానుభవాలని దృష్టిలో పెట్టుకుని వాటి నుండి పాఠాలు నేర్చుకుని ప్రజల మనోభావాలకు తగ్గట్లుగా పాలన సాగిస్తేనే వారి మనుగడ సాధ్యం. లేదంటే అయిదేళ్ల తరువాత వీరు వారయ్యే పరిస్థితి తలెత్తక తప్పదు. చేతులు కాలాక ఆకులు పట్టుకుని ప్రయోజనం లేదు. చరిత్ర పునరావృతం కాకుండా ప్రస్తుత ప్రభుత్వాలు గతంకన్నా మంచి పాలన అందిస్తే అందరికీ మంచిది!

లక్ష్మీభరద్వాజ్, హైదరాబాదు.

# వై.ఎస్. పేరు చెడగొట్టాడు!

రాజశేఖరరెడ్డి కొడుకు కదా... ఆయనకంటే గొప్పగా కాకపోయినా కనీసం ఆయనలాగ అయినా పరిపాలిస్తాడని ఆశించి జనమంతా జగన్‌మోహన్‌రెడ్డికి ఓట్లేసి గెలిపిస్తే... వాళ్ళ నాయన పేరు కూడా చెడగొట్టాడు. చుట్టూ అజ్ఞానులైన సలహాదారులని పెట్టుకుని నియంతలా వ్యవహరించాడు. మీ అందరికీ డబ్బులిచ్చానని ప్రతిసారీ చెప్పి అపఖ్యాతి పాలయ్యాడు. మనం చేసిన సహాయం, ఆ సాయం పొందిన వాళ్ళు గుర్తు పెట్టుకోవాలి. అంతే తప్ప మనమే ఊదరగొట్టుకోకూడదు. అలాచెప్తే ఆ సహాయం పొందిన వాళ్ళని మనం అవమానపరచినట్లే. డబ్బులిచ్చానని పదే పదే చెప్పుకునే బదులు, ఇంత అభివృద్ధి చేశాను, ఇన్ని ఉద్యోగాలు కల్పించాను, ఇన్ని కుటుంబాలకి శాశ్వత ఉపాధి కల్పించాను అని చెప్పుకోగలిగి ఉంటే జగన్‌కి ఇలాంటి పరిస్థితి దాపురించేది కాదు. ఇప్పటికైనా జగన్ బటన్ సంగతి మర్చిపోతే మంచిది. లేదంటే ప్రజలే ఆయనని మర్చిపోతారు.

డాక్టర్ కార్తీక్, నెల్లూరు.




# తిట్ల సభలుగా మారిపోయిన చట్ట సభలు!

అటు దేశంలోనూ, ఇటు రాష్ట్రాలలోనూ చట్ట సభలు జరుగుతున్న తీరు చూస్తుంటే అసహ్యమేస్తోంది.

ప్రజాస్వామ్య వ్యవస్థలు అపహాస్యమైపోతున్నాయా? అన్న అనుమానం వస్తోంది.

రాజకీయ విన్యాసాలతో, నేతల పరస్పర దూషణలతో చట్ట సభలు రచ్చ సభలుగా మారిపోయాయి.

నేతల బలప్రదర్శనకి, వారి అహంకారపూరిత ప్రహసనాలకి లోక్‌సభ, శాసనసభలు వేదికలుగా తయారయ్యాయి.

ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్‌లో గత దశాబ్ద కాలంగా అసెంబ్లీ సమావేశాలు జరుగుతున్న తీరు గమనిస్తోంటే, రాజకీయాలు ఇంత నీచంగా తయారయ్యాయా? అన్న బాధ జనం మనసులని తొలిచేస్తోంది.

సమాజ హితమే ప్రామాణికంగా ప్రజల కోసం, ప్రజల చేత ఎన్నుకోబడిన ప్రజా నాయకులు శాసనసభలో మాట్లాడుతున్న మాటలు, ఒకరిపై ఒకరు విసురుకుంటున్న సవాళ్లు చూస్తుంటే రోత పుడుతోంది.

ప్రజాసమస్యలు గాలికి వదిలేసి, దూషణలో, దాడులలో తమ ప్రతిభా ప్రావీణ్యాలను చూపించడం కోసం, అధినాయకుడి ముందు స్వామి భక్తి ప్రదర్శించడం కోసం పోటీపడుతున్న నేతల పోకడ చూస్తే... వీళ్ళు ప్రజా ప్రతినిధులా, వీధిరౌడీలా అన్న భావన కలుగుతోంది.

## బూడిదలో పోసిన పన్నీరవుతున్న కోట్ల రూపాయల ఖర్చు!

ప్రజాస్వామ్య వ్యవస్థలో ఎన్నికలు, ఆ తరువాత దశలవారీగా జరిగే లోక్‌సభ, అసెంబ్లీ సమావేశాలన్నవి చాలా ఖర్చుతో ముడిపడిన అంశాలు.

అయిదేళ్లకి ఒకేసారి వచ్చే ఎన్నికలకి కొన్ని వేలకోట్ల రూపాయలు ఖర్చవుతాయి.

జనం తరఫున చట్టసభలలో ప్రాతినిధ్యం వహిస్తున్నందుకు, ప్రజల అవసరాలు, హక్కుల కొరకు పోరాడుతున్నందుకు ప్రజాప్రతినిధులకు ప్రభుత్వం జీతం కూడా ఇస్తుంది.

జీతంతో పాటు ప్రభుత్వ ఖర్చులతో వసతి సౌకర్యాలు, రవాణా, వ్యక్తిగత సిబ్బంది వంటి అన్ని భోగాలు కల్పిస్తుంది.

ఇదంతా ప్రజల సొమ్మే... ప్రజలు పన్నుల రూపంలో చెల్లించిన డబ్బులే. కానీ ఆ ఖర్చుకి సార్ధకత లభించడంలేదు.

ప్రజా సమస్యలపై సదరు సభలలో చర్చలు జరగడం లేదు.

రోజుల తరబడి జరిగే సమావేశాలవల్ల ప్రజలకి ఎలాంటి ప్రయోజనం ఒనకూరడంలేదు.

పైగా... ఆ సమావేశాలని ప్రత్యక్ష ప్రసారం చేస్తున్నందువల్ల సమాజానికి లాభం కంటే నష్టమే ఎక్కువ జరుగుతోంది.

నేతలు తన్నుకుని, తిట్టుకుంటున్న దృశ్యాలని టీవీలలో, సామాజిక మాధ్యమాలలో చూస్తున్న యువతకి తప్పుడు సంకేతాలు వెళ్తున్నాయి.

రాజకీయాలంటే ఇలాగే ఉంటాయేమో, రాజకీయ నేతలంటే ఇలానే ఉండాలేమో అన్న ఆలోచన వాళ్లలో కలిగేలా ఈ సమావేశాలు వారిని ప్రభావితం చేస్తున్నాయి.

ముఖ్యంగా ఈ సమావేశాలు జరిగే సమయంలో ఇంట్లో కుటుంబ సమేతంగా కూర్చుని సమావేశాలని వీక్షించే పరిస్థితి లేదు.

మహిళలు శాసనసభ సమావేశాలు చూడాలంటేనే సిగ్గుపడే పరిస్థితికి సమావేశాల సరళిని నేటితరం నాయకులు దిగజార్చేశారు.

అదే సమావేశాలలో పాల్గొంటున్న మహిళా ప్రజాప్రతినిధులు కూడా ఈ తరహా బూతు పురాణాలకి అలవాటు పడిపోయారంటే, మన చట్టసభల సమావేశాలు ఎంత నీచ స్థాయికి దిగజారిపోయాయో చెప్పడానికి ఇంత కంటే ఉదాహరణ అవసరం లేదు.

సమావేశాలలో రాజకీయ నాయకులు మాట్లాడే పచ్చి బూతులను చూసి చిన్నపిల్లలు అవే నీతి వ్యాక్యాలుగా భావిస్తున్నారు. అధిక శాతం ఆంగ్ల మాధ్యమంలో చదువుకునే చిన్నారులు ఈ బూతులు కూడా తెలుగు భాషలో ఓ భాగమే అనుకుంటున్నారు.

తమ ఇళ్లల్లోనూ, తమ స్నేహితులతోనూ అవే బూతులు మాట్లాడుతున్నారు.

అచ్చంగా అసెంబ్లీలో దూషించుకుంటున్నట్లుగా ఈ పసిపిల్లలు కూడా పరస్పరం తిట్టుకుంటున్నారు.

సభలలో తొడలు చరుస్తూ, మీసాలు తిప్పుతూ నేతలు వాడుతున్న అత్యంత జుగుప్సాకరమైన భాష వింటుంటే ఈ ప్రబుద్ధులకి సంస్కారం, సంసారం ఉన్నాయా అన్న సందేహం వస్తోంది.

తమ స్వార్ధ రాజకీయాల కోసం ఇతరుల వ్యక్తిగత జీవితాలలో తొంగి చూసి వారి కుటుంబ పరువును బజారుపాలు చేసే నీచస్థాయికి నేతలు దిగజారుతున్నారు.

శాసనసభ సమావేశాలని 'ఇది గౌరవ సభ కాదు.. కౌరవ సభ' అని సాక్షాత్తూ సభలోని ప్రధానప్రతిపక్ష నాయకుడు వ్యాఖ్యానించాడంటే పరిస్థితులు ఎంత అధ్వాన్నంగా తయారయ్యాయో ఊహించుకోవచ్చు.

వీళ్ల ఇళ్లల్లో ఆడవాళ్లు, పిల్లలు సమావేశాలు చూడరా? ఒకవేళ చూస్తుంటే ఇళ్ళకి వెళ్ళాక వీళ్ళని ఇదేం సంప్రదాయమని ప్రశ్నించరా?? అలా ప్రశ్నిస్తే వీళ్ళేం సమాధానం చెప్తారు??? అన్న సందేహం మేధావివర్గం నుండి వ్యక్తమవుతోంది.

## మన నేతల తీరు మారాలి.. మార్పు దిశగా ప్రతినబూనాలి!

బ్రిటీష్ ముష్కరుల చెరనుండి మన దేశం విముక్త భారత్‌గా అవతరించి డెబ్బై ఏడు సంవత్సరాలయ్యిందని చంకలు గుద్దుకుంటున్న తరుణంలో, సమాజానికి మనమేం సందేశం ఇస్తున్నామో నేతలు ఒక్కసారి ఆలోచించుకోవాలి.

సమాజహితం కోసం శక్తివంచనలేకుండా కష్టపడతామని, భగవంతుని సాక్షిగా, అంతఃకరణ శుద్ధిగా ప్రమాణం చేసి పదవీ బాధ్యతలు చేపడుతున్న నాయకులు తమని తాము ప్రశ్నించుకోవాలి. మనం నేర్చుకున్న సభ్యత, సంస్కారం, సంస్కృతీ ఇదేనా అని ఒక్కసారి ఆత్మావలోకనం చేసుకోవాలి.

భవిష్యత్తులో 'బూతు' అన్న మాటకే అర్ధం తెలియనీయకుండా రేపటి పౌరులు మనుగడ సాగించేలా తాము నడుచుకుంటామని మన ప్రజా ప్రతినిధులు ప్రతినబూనాలి!

- రాజశ్రీ

# ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుంటాం

## రెండున్నరేళ్లలో రాజధాని నిర్మాణాన్ని పూర్తిచేస్తాం

### - మంత్రి నారాయణ



సార్వత్రిక ఎన్నికల్లో తనను భారీ మెజార్టీతో గెలిపించిన ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ, వారి ఆశలు ఆకాంక్షలకు తగ్గట్టుగా పనిచేస్తామని రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ చెప్పారు. తన పుట్టినరోజు సందర్భంగా తన నివాసానికి పెద్దఎత్తున వచ్చిన ప్రజలు, అభిమానులు, తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలనుద్దేశించి ఆయన మాట్లాడారు. తనకు పురపాలక శాఖ మంత్రి పదవిని కేటాయించినందుకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు ఆయన ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. అమరావతి రాజధానిగా ఉండాలనేది చంద్రబాబునాయుడు కల అని, ఆయన నాయకత్వంలో ఆ కల సాకారమవుతుందని అన్నారు. అమరావతి రాజధాని కోసం 2015 జనవరి 1వతేదీ ల్యాండ్ పూలింగ్ కోసం నోటిఫికేషన్ ఇచ్చామని, చంద్రబాబునాయుడుపై ఎంతో నమ్మకంతో ప్రజలు, రైతులు ఫిబ్రవరి28వ తేదీ నాటికి 34వేల ఎకరాలను ప్రభుత్వానికి ఇవ్వడం జరిగిందని ఆయన ఈ సందర్భంగా తెలిపారు. దాదాపు 48వేల కోట్ల రూపాయలతో టెండర్లు పిలవడం జరిగిందని, అందులో కూడా 9వేల కోట్ల రూపాయలను ఖర్చు పెట్టి అధికారులకు భవనాలను 90 శాతం పూర్తిచేశామని, అయితే ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన వైకాపా ప్రభుత్వం వాటన్నిటినీ నిర్వీర్యంచేసి మూడు రాజధానులు అంటూ చివరికి రాష్ట్రానికి ఒక్క రాజధాని కూడా లేకుండా చేసిందని ఆయన వివరించారు. రానున్న రెండున్నర సంవత్సరాల కాలంలో అమరావతి రాజధానిని పూర్తిచేయాలన్నదే తన లక్ష్యమని ఆయనన్నారు.

# ప్రజాసేవే పరమావధిగా పనిచేస్తా



### - పెంచలకోనలో 'ఆనం'

ప్రజల ఆశీస్సులతో ఈ ఎన్నికల్లో విజయం సాధించగలిగామని, ప్రజాసేవే పరమావధిగా పనిచేస్తామని రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి చెప్పారు. ఈనెల 17వ తేదీ సాయంత్రం ఆయన జిల్లాలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన పెంచలకోనలో వెంకటగిరి శాసనసభ్యులు కురుగొండ్ల రామకృష్ణతో కలిసి శ్రీ పెనుశిల లక్ష్మీ నరసింహస్వామి ఆలయాన్ని దర్శించుకుని పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన్ను ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గత నాలుగు దశాబ్దాలుగా రాజకీయ జీవితంలో ప్రజలకు సేవ చేయడమే పరమావధిగా తాను పనిచేస్తున్నట్లు చెప్పారు. రాజకీయరంగంలో తాను ఉన్నతంగా రాణించడానికి చెంచులక్ష్మి, ఆదిలక్ష్మి సమేత శ్రీ పెనుశిల లక్ష్మీనరసింహస్వామి కరుణాకటాక్షాలే కారణమన్నారు. నమ్మినవారికి కొంగు బంగారంగా లక్ష్మీ నరసింహస్వామి అండగా ఉంటారని చెప్పారు. ఇప్పుడు దేవాదాయ శాఖ మంత్రిగా స్వామిని దర్శించుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఇదంతా కూడా ఆ దేవదేవుని అనుగ్రహం వల్లే సాధ్యమైందన్నారు. వెంకటగిరి శాసనసభ్యులు కురుగొండ్ల రామకృష్ణ ఆధ్వర్యంలో ఈ ప్రాంత అభివృద్ధికి అన్ని విధాల తోడ్పాటును అందిస్తానని మంత్రి పేర్కొన్నారు. జిల్లా అటవీశాఖ అధికారి చంద్రశేఖర్, దేవాదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ శ్రీనివాసరావు, ఇఓ సాగర్‌బాబు పాల్గొన్నారు.

# వైభవోపేతంగా లేబూరు కుంకాళమ్మ గ్రామోత్సవం



జిల్లాలోని ప్రసిద్ధమైన ఇందుకూరుపేట మండలం లేబూరు గ్రామంలో కొలువైవున్న గ్రామదేవత లేబూరు కుంకాళమ్మ తల్లి బ్రహ్మోత్సవాల్లో భాగంగా, ఈనెల 18న అమ్మవారిని వివిధ రకాల పూలమాలలతో శోభాయమానంగా అలంకరించి ప్రత్యేకపూజలు చేశారు. అనంతరం, పెద్దఎత్తున అమ్మవారి గ్రామోత్సవం జరిగింది. వేలాదిమంది గ్రామస్థులు, భక్తులు ఈ ఉత్సవంలో పాల్గొని అడుగడుగునా అమ్మవారికి కొబ్బరికాయలు, కర్పూరహారతులు సమర్పించుకున్నారు. దీంతో లేబూరు గ్రామం భక్తజన సంద్రంగా మారింది.

# అద్దాల మండపానికి మరింత వైభవం తెస్తాం

## దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణ

రాష్ట్రంలోనే ప్రఖ్యాతిగాంచిన నెల్లూరు శ్రీ రంగనాథస్వామి దేవాలయంలోని.. దాదాపు వందేళ్ళ చరిత్ర కలిగిన అద్భుతమైన అద్దాల మండపానికి మరింత వైభవాన్ని తెచ్చేవిధంగా కృషిచేస్తామని రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి చెప్పారు. ఈనెల 17న ఆయన నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి నారాయణతో కలసి నెల్లూరు రంగనాయకులపేటలోని శ్రీదేవి భూదేవి సమేత శ్రీ తల్పగిరి రంగనాథస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఆలయంలోని అద్దాల మండపానికి పూర్వవైభవం తెచ్చే విషయమై మంత్రి నారాయణతో చర్చించామన్నారు. ఆలయ ప్రాంగణంలో ఆగిపోయిన అన్ని అభివృద్ధి పనులన్నిటినీ పూర్తి చేస్తామన్నారు. ఆలయానికి సంబంధించి పడమటి మహాద్వారం, ఘాట్‌ల నిర్మాణపు పనులను ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, మంత్రి నారాయణ సూచనలతో పూర్తి చేసేందుకు కృషి చేస్తామని తెలిపారు. వేమిరెడ్డి మాట్లాడుతూ శ్రీ రంగనాథస్వామి వారి ఆశీస్సులు జిల్లా ప్రజలపై ఎల్లప్పుడూ ఉండాలని ఆకాంక్షించారు. జిల్లాకు ఇద్దరు మంత్రులను కేటాయించిన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు ప్రత్యేక ధన్యవాదాలు చెప్తున్నామన్నారు. శ్రీ రంగనాథస్వామి ఆశీస్సులతో, మంత్రుల సహకారంతో జిల్లా అభివృద్ధి పథంలో పయనిస్తుందని ఆకాంక్షించారు. చంద్రబాబు ముఖ్యమంత్రి అయిన నేపథ్యంలో రాష్ట్రం ఉన్నత స్థాయికి చేరుతుందన్నారు. తల్పగిరి రంగనాథస్వామి వారిని దర్శించుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు. మంత్రి ఆనం రామ నారాయణరెడ్డిగారు, ఎంపీ వేమిరెడ్డి, తాము కలసి అద్దాల మండపాన్ని పునర్నిర్మిస్తామని ఈ కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ అన్నారు. తొలుత, ఆలయ అర్చకులు, అధికారులు నేతలకు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు.





## మాఫియాల ఆగడాలను

# సహించేది లేదు

### కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి

సహజ వనరులను కొల్లగొట్టే గ్రావెల్ మాఫియా, మట్టి మాఫియా ఆగడాలను సహించేది లేదని, వెంటనే వాటిని అడ్డుకోవాలని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి అధికారులను ఆదేశించారు. నెల్లూరు నగరంలోని తమ నివాసంలో ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి ఇటీవల కోవూరు నియోజకవర్గ పరిధిలోని కోవూరు, విడవలూరు, కొడవలూరు, ఇందుకూరుపేట, బుచ్చిరెడ్డిపాళెం మండలాలకు చెందిన తహశీల్దార్లతో సమీక్ష నిర్వహించారు. ఇసుక రీచ్‌లకు సంబంధించి ప్రభుత్వం విధివిధానాలు రూపొందించే వరకు నియోజకవర్గ పరిధిలోని ఇసుక రీచ్‌ల నుంచి ఇసుక తరలింపు నిలిపివేయాలని ఆమె వారికి సూచించారు. మట్టి మాఫియా కదలికలపై ప్రత్యేక నిఘా పెట్టాలన్నారు. అక్రమ మైనింగ్ మరియు అడ్డగోలు రియల్ ఎస్టేట్ అనుమతులపై అప్రమత్తంగా ఉండాలని, ఎక్కడైనా అవకతవకలు, అవినీతి జరిగినట్టు తెలిస్తే సహించేది లేదని ఆమె హెచ్చరించారు. అక్రమ మైనింగ్ కార్యకలాపాల్లో ఏ పార్టీ నేతలున్నా ఉపేక్షించవద్దని చెప్పారు. ప్రజలకు అందుబాటులో ప్రజా సమస్యల పరిష్కారంలో ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఆమె అధికారులకు చెప్పారు.

## ఫిట్‌నెస్ లేని

# స్కూలు బస్సులు సీజ్

ఫిట్‌నెస్ లేకుండా తిరుగుతున్న స్కూల్ బస్సుల పట్ల రవాణాశాఖ అధికారులు దృష్టి సారించారు. ఇటీవల మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ రాంబాబు జిల్లాలోని పలుప్రాంతాల్లో తనిఖీలు చేసి, పలు విద్యాసంస్థలకు చెందిన 3 బస్సులను సీజ్ చేశారు. ఫిట్‌నెస్ సర్టిఫికెట్ లేకుండా బస్సులు తిరిగితే సహించేది లేదని ఆయన ఈ సందర్భంగా హెచ్చరించారు.

# వేమిరెడ్డి దంపతులతో మంత్రి ఆనం భేటీ



రాష్ట్ర దేవాదాయ, ధర్మాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి నెల్లూరు ఎంపీగా ఘన విజయం సాధించిన వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని, కోవూరు ఎమ్మెల్యేగా గెలుపొందిన వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డిని ఈనెల 16న మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా మాగుంట లేఅవుట్‌లోని విపిఆర్ నివాసానికి వచ్చిన ఆనం రామనారాయణరెడ్డిని వేమిరెడ్డి దంపతులు సాదరంగా స్వాగతించారు. రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన ఆనంకు వారు శుభాకాంక్షలు తెలియజేశారు. రాష్ట్ర మంత్రిగా ఉత్తమ సేవలు అందించాలని ఆకాంక్షించారు.



# వేమిరెడ్డి దంపతులకు ఆత్మీయ సన్మానం

సార్వత్రిక ఎన్నికలలో నెల్లూరు పార్లమెంటు సభ్యునిగా అత్యధిక మెజారిటీతో ఘన విజయం సాధించిన వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని, ఆయన సతీమణి.. కోవూరు శాసనసభ సభ్యురాలుగా భారీ మెజారిటీతో గెలిచిన వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డిని ఇటీవల జిల్లా రైస్ మిల్లర్స్ తరపున ఆ సంఘం అధ్యక్షులు యాలమూరి రంగయ్యనాయుడు ఆత్మీయంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ కర్నాటక కో-ఆర్డినేటర్ రావి మోహన్‌చౌదరి తదితరులు పాల్గొన్నారు.

# జిల్లాకు పీఎం కిసాన్ నిధులు.. రూ.33.19 కోట్లు

కేంద్రప్రభుత్వం రైతులకు పెట్టుబడి సాయంగా అందజేసే పీఎం కిసాన్ నిధులు ఈనెల 18న విడుదలయ్యాయి. ప్రధానమంత్రి నరేంద్రమోడీ వారణాసి నుంచి ఆన్‌లైన్ విధానంలో ఆ నిధులను విడుదల చేయడంతో జిల్లా రైతాంగంలో సంతోషం వెల్లువెత్తింది. ఆ కార్యక్రమాన్ని జిల్లాలోని అన్ని రైతుభరోసా కేంద్రాల్లో ప్రత్యక్ష ప్రసారం చేశారు. ఈ ఏడాదికి సంబంధించి జిల్లాకు 33,19,56,000 రూపాయలు నిధులు విడుదలయ్యాయని, జిల్లాలో అర్హత కలిగిన 1,65,978మంది రైతుల వ్యక్తిగత ఖాతాల్లో అవి జమ అవుతాయని వ్యవసాయ శాఖ జాయింట్ డైరెక్టర్ సత్యవాణి తెలిపారు.

### అపోలో హాస్పిటల్స్ ఛైర్మెన్

## ప్రతాప్‌రెడ్డిని కలిసిన..ఎంపీ వేమిరెడ్డి



అపోలో హాస్పిటల్స్ ఫౌండర్ ఛైర్మన్ ప్రతాప్ సి.రెడ్డిని నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ఇటీవల మర్యాదపూర్వకంగా కలిశారు. చెన్నైలోని అపోలో హాస్పిటల్‌కు వచ్చిన వేమిరెడ్డికి ప్రతాప్ సి.రెడ్డి, హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ సునీతరెడ్డి శుభాకాంక్షలు తెలిపి సన్మానించారు.

## మంత్రి నారాయణకు జన్మదిన శుభాకాంక్షలు



రాష్ట్ర మునిసిపల్ మంత్రి పొంగూరు నారాయణకి నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఆయన సతీమణి.. కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి దంపతులు ఇటీవల ఆయన నివాసంలో కలసి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.

## 82 సార్లు రక్తదానం చేసిన దయాశంకర్

### రెడ్‌క్రాస్ నుంచి అవార్డునందుకున్న పాత్రికేయుడు



సీనియర్ పాత్రికేయుడు, విశాలాంధ్ర దినపత్రిక బ్యూరో ఇన్‌చార్జి దయాశంకర్ రక్తదాతలకు స్ఫూర్తిగా నిలిచాడు. పాత్రికేయరంగంలో ఉంటూ సమాజసేవాభావంతో ఇప్పటికి 82సార్లు రక్తదానం చేసి ఇటీవల నెల్లూరు జిల్లా రెడ్‌క్రాస్ వారి నుంచి అవార్డు అందుకున్నారు. ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా జిల్లా రెడ్ క్రాస్ ఛైర్మెన్.. ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఆయనకు 'రక్తదాత' అవార్డును బహుకరించి ఘనంగా సన్మానించారు.

# నెల్లూరు కబుర్లు

## త్యాగానికి ప్రతీక బక్రీద్ పండుగ



బక్రీద్ పండుగ త్యాగానికి ప్రతీక అని మంత్రి నారాయణ అన్నారు. బక్రీద్ పర్వదినాన్ని పురస్కరించుకుని ఇటీవల ఆయన నెల్లూరు నగరంలోని బారాషహిద్ దర్గాను నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డిలతో కలిసి దర్శించుకుని, దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అందరి సహకారంతో భవిష్యత్తులో బారాషహీద్ దర్గా అభివృద్ధికి కృషిచేస్తామని నేతలు ఈ సందర్భంగా తెలియజేశారు. అల్లా ఆశీస్సులు అందరిపై ఉండాలని ప్రార్థించారు. ఎంతో పవిత్రమైన ఈ దర్గాను అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తామన్నారు. తొలుత, దర్గాకు విచ్చేసిన ఎంపీకి, మంత్రులకు ముస్లిం మతపెద్దలు, మైనార్టీ సోదరులు ఘనంగా స్వాగతం పలికారు. వారి వెంట జిల్లా టీడీపీ అధ్యక్షులు అబ్దుల్ అజీజ్ తదితరులు పాల్గొన్నారు.

## మంత్రిని కలసిన కలెక్టర్, ఎస్పీ



రాష్ట్ర పురపాలక శాఖ మంత్రిగా పదవిని స్వీకరించిన డాక్టర్ పొంగూరు నారాయణ పుట్టినరోజును పురస్కరించుకుని జిల్లా కలెక్టర్ హరినారాయణ్, ఎస్పీ ఆరీఫ్ హాఫీజ్‌లు ఆయనను వారి నివాసంలో మర్యాదపూర్వకంగా కలసి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.

## శ్రీ వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభం

నెల్లూరు మాగుంట లేఅవుట్‌లో ఉన్న శ్రీ గోదా-పద్మావతీ సమేత శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామి దేవాలయంలో స్వామివారికి ఈనెల 19వ తేది నుంచి వైభవంగా బ్రహ్మోత్సవాలు జరుగుతున్నాయి. బుధవారం సాయంత్రం విష్వక్సేనారాధన, అంకురార్పణ పూజలతో ఈ ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. 20వ తేది గురువారం రాత్రి శేషవాహనోత్సవం కన్నుల పండువగా జరిగింది. 21న హనుమంత వాహనసేవ, 22న గరుడసేవ, 23న గజవాహనోత్సవం, 24న పుష్పయాగం, అశ్వ వాహనసేవలు నిర్వహించనున్నారు. అదేవిధంగా, ఈనెల 25వ తేదీ సాయంత్రం ద్వాదశ ప్రదక్షిణలు, ద్వాదశారాధనలు, స్వామివారి పవళింపు సేవ వేడుకగా నిర్వహిస్తామని, భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చి స్వామివారి అనుగ్రహానికి పాత్రులు కావాలని నిర్వాహకులు కోరారు.

## ఆలయాల పూర్వ వైభవానికి కృషిచేస్తా



**- మంత్రి ఆనం**

రాష్ట్రంలోని ఆలయాల అభివృద్ధి, పునర్నిర్మాణ పనులపై ప్రత్యేక దృష్టి సారించి ఆలయాల పూర్వ వైభవానికి కృషి చేస్తానని రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి చెప్పారు. మంగళవారం నెల్లూరు సంతపేటలోని తన నివాసంలో ఆయన తనను కలిసిన విలేకర్లతో మాట్లాడారు. రాష్ట్రంలో శతాబ్దాల చరిత్ర గల ఆలయాలు ఎన్నో ఉన్నాయని, వాటి అభివృద్ధి, పునర్నిర్మాణ పనులపై ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడితో మాట్లాడి చర్యలు తీసుకుంటామని మంత్రి తెలిపారు. ప్రధాన ఆలయాలను మరింత పటిష్టం చేయాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. దేవాదాయశాఖలో ప్రక్షాళన చేపట్టి సమూల మార్పులకు శ్రీకారం చుట్టనున్నట్లు చెప్పారు. అనేక ఆలయాలకు వందల ఎకరాల్లో భూములు, ఆస్తులు వున్నా ఆలయాలు అభివృద్ధికి నోచుకోకుండా ఉండిపోయాయని, అలాంటి ఆలయాలను గుర్తించి దేవాలయాల ఆస్తుల పరిరక్షణకు చట్టప్రకారం చర్యలు చేపట్టనున్నట్లు చెప్పారు. కొన్ని దేవాలయాల భూములు, ఆస్తులను ఇతరులు అన్యాక్రాంతం చేసి కబ్జాలకు పాల్పడి వున్నారని, వాటిని కూడా గుర్తించి అధికారులతో సమీక్షించి చట్టప్రకారం చర్యలు చేపడతామని తెలిపారు. ఆలయాలను అభివృద్ధిచేసి ప్రజల్లో ఆధ్యాత్మిక భావనను పెంపొందించి హిందూ ధర్మ పరిరక్షణకు కృషిచేయడమే ప్రధానలక్ష్యంగా పనిచేస్తామని ఈ సందర్భంగా మంత్రి స్పష్టం చేశారు.

## ఆనంకు అభినందనలు తెలిపిన మాగుంట



రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన ఆనం రామనారాయణరెడ్డిని ఈనెల 18న నెల్లూరులోని ఆనం నివాసంలో ఒంగోలు పార్లమెంటు సభ్యులు మాగుంట శ్రీనివాసులురెడ్డి కలిసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి ఆయన్ను సాదరంగా స్వాగతించి, ఆత్మీయంగా శాలువతో సన్మానించారు.

## సోమిరెడ్డి-రామనారాయణరెడ్డి భేటీ



సర్వేపల్లి శాసనసభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డితో ఇటీవల రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి భేటీ అయ్యారు. నెల్లూరు వేదాయపాళెంలోని సోమిరెడ్డి క్యాంప్ కార్యాలయంలో ఇద్దరు నేతలు కలుసుకుని పరస్పరం శుభాకాంక్షలు చెప్పుకున్నారు. ఈ సందర్భంగా ఆనంను సోమిరెడ్డి ఆత్మీయంగా స్వాగతించారు.




## సోమశిల డ్యాం రక్షణ పనులు చేపట్టండి

### - బీజేపీ నాయకుడు మిడతల వినతి -

జిల్లా రైతాంగానికి ప్రాణప్రదమైన సోమశిల డ్యాం రక్షణ పనులను వెంటనే చేపట్టాలని బిజెపి నమామి గంగే రాష్ట్ర కన్వీనర్ మిడతల రమేష్, బీజేపీ సీనియర్ నాయకులు పేర్నాటి రంగారెడ్డిలు రాష్ట్ర దేవదాయ ధర్మదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డికి ఇటీవల విజ్ఞప్తి చేశారు. మూడు సంవత్సరాల క్రితం వచ్చిన వరదలకు సోమశిల ముందు భాగంలో ఉన్న స్పిల్‌వే ఆప్రాన్, రక్షణ గోడలు, కాంక్రీట్ దిమ్మెలు, సోమేశ్వరాలయం గోడ దెబ్బతిన్నాయని, వాటిని బాగుచేయించాలని కోరారు. సోమశిల జలాశయం పట్ల సంపూర్ణ అవగాహన కలిగిన మీరు, ఈ విషయాల్లో జోక్యం చేసుకొని వాటిని కాపాడాలని వారు మంత్రిని కోరారు.

## నగరంలో పేకాట... ఆరుగురు అరెస్టు

ఈనెల 18న నెల్లూరు నగర శివారుల్లో ఓ పేకాట స్థావరంపై నగర డిఎస్పీ శ్రీనివాసులురెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు దాడిచేసి ఆరుగురు పేకాటరాయుళ్ళను అరెస్టు చేశారు. పోలీసుల సమాచారం మేరకు... నిప్పోసెంటర్‌కు చెందిన సంజీవయ్యనాయుడు నెల్లూరు రూరల్ మండలంలోని అక్కచెరువుపాడులో ఒక భవనాన్ని అద్దెకు తీసుకుని గత కొంత కాలంగా పేకాట నిర్వహిస్తున్నారని సమాచారం అందడంతో ఆ స్థావరంపై దాడిచేసి నిర్వాహకుడితో పాటు మరో అయిదుగురు జూదరులను అరెస్ట్ చేసి, వారి వద్దవున్న 31,600 రూపాయలు, సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకుని వారిని పోలీస్‌స్టేషన్‌కు తరలించి కేసు నమోదుచేశారు.

# రామనారాయణకి గుళ్ళు - దేవుళ్ళు
# నారాయణకి పట్టణాలు - నగరాలు
# సత్యకుమార్‌కి ఆసుపత్రులు - ఆరోగ్యం



• జిల్లా మంత్రులకు కీలక శాఖలు

సార్వత్రిక ఎన్నికల్లో ఘన విజయం సాధించి రాష్ట్ర ముఖ్యమంత్రిగా జూన్ 13న వెలగపూడిలోని సచివాలయంలో పదవీ బాధ్యతలు చేపట్టిన నారా చంద్రబాబునాయుడు మంత్రివర్గంలో శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరుజిల్లాకు చెందిన ఇద్దరు నేతలకు, జిల్లాతో అనుబంధం ఉన్న మరో నాయకునికి కీలకమైన శాఖలు లభించడంతో పార్టీవర్గాలతో పాటు ప్రజలు కూడా సంతోషం చేస్తున్నారు. జిల్లాలో సీనియర్‌గా ఉన్న ఆనం రామనారాయణరెడ్డికి భగవత్సంబంధమైన, ఎంతో గౌరవప్రదమైన దేవాదాయశాఖను కేటాయించారు. డాక్టర్ పొంగూరు నారాయణకు గతంలో వలెనే పురపాలక, పట్టణాభివృద్ధిశాఖ ఇచ్చారు. జిల్లాతో అనుబంధం ఉన్న రాయలసీమ నాయకుడు, బీజేపీలో సమర్ధవంతంగా పనిచేసే సైనికుడు సత్యకుమార్ ఎంతో బాధ్యతాయుతమైన వైద్యారోగ్యశాఖ, కుటుంబ సంక్షేమం, వైద్య శాఖలకు మంత్రిగా నియమితులయ్యారు. దీంతో జిల్లాలోని తెలుగుదేశం, బీజేపీ, జనసేన ఉమ్మడి కూటమి శ్రేణుల్లో ఆనందాతిరేకాలు వ్యక్తమయ్యాయి. మంత్రులంతా తమకు కేటాయించిన శాఖలు తమకు ఇష్టమైనవేనని, తమ మసనుకు తగ్గట్టుగా సంతృప్తిగా ఉన్నాయని సంతోషం కూడా వ్యక్తం చేశారు.

## ఏయే శాఖలు ఎవరెవరికి?..

సాధారణ పరిపాలన, శాంతిభద్రతలు, పబ్లిక్ ఎంటర్‌ప్రైజెస్‌తో పాటు మంత్రులకు కేటాయించని ఇతర శాఖలన్నీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు వద్దనే ఉంటాయి. జనాకర్షక నేత, జనసేనాని అధిపతి కొణిదెల పవన్ కల్యాణ్‌కు ముఖ్యమంత్రి తర్వాత ముఖ్యమంత్రి అంతటి ముఖ్యమైన ఉప ముఖ్యమంత్రి పదవిని కేటాయించారు. ఆయన ఆధ్వర్యంలో పంచాయతిరాజ్, గ్రామీణాభివృద్ధి, ఆర్‌డబ్ల్యుఎస్, పర్యావరణ, అటవీశాఖలు, శాస్త్ర సాంకేతికశాఖలు ఉంటాయి. యువనేత నారా లోకేష్‌కు మానవనరుల అభివృద్ధి, విద్యాశాఖ, ఐటీ, ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్స్, ఆర్టీజీ (రియల్‌టైమ్ గవర్నెన్స్)శాఖలు ఇవ్వగా, కింజెరాపు అచ్చెన్నాయుడుకు వ్యవసాయం, సహకారశాఖ, మార్కెటింగ్, పశుసంవర్ధకశాఖ, డెయిరీ డెవలప్‌మెంట్, మత్స్యశాఖలను కేటాయించారు. అదేవిధంగా, కొల్లు రవీంద్రకు గనులు, భూగర్భ శాఖ, ఎక్సైజ్ శాఖలిచ్చారు. జనసేన నాయకుడు నాదెండ్ల మనోహర్‌కు ఆహారం, పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాలు అప్పగించారు. వంగలపూడి అనితకు హోంశాఖ, విపత్తు నిర్వహణశాఖలు అప్పగించారు. నిమ్మల రామానాయుడుకు జలవనరుల శాఖను, ఎన్ఎండి ఫరూఖ్‌కు మైనార్టీ సంక్షేమం, న్యాయశాఖల బాధ్యతలను అప్పజెప్పారు. పయ్యావుల కేశవ్‌కు ఆర్థికశాఖతో పాటు వాణిజ్యపన్నులు, శాసనసభ వ్యవహారాలను అప్పగించారు. అనగాని సత్యప్రసాద్‌కు రెవిన్యూ, రిజిస్ట్రేషన్, స్టాంపులు, డోలా బాలవీరాంజనేయస్వామికి సాంఘిక సంక్షేమం, దివ్యాంగులు, సీనియర్ సిటిజన్ల సంక్షేమం సచివాలయాలు, వలంటీర్ల శాఖలను అప్పగించారు. కొలుసు పార్థసారథికి గృహనిర్మాణం, సమాచార శాఖ అప్పగించారు. గొట్టిపాటి రవికుమార్‌కు విద్యుత్‌శాఖ ఇచ్చారు. కందుల దుర్గేష్‌కు పర్యాటకం, సాంస్కృతికం, సినిమాటోగ్రఫీశాఖలను కేటాయించగా; గుమ్మడి సంధ్యారాణికి మహిళా శిశు సంక్షేమం, గిరిజన సంక్షేమం శాఖలను, బీసీ జనార్దన్‌రెడ్డికి రహదారులు-భవనాలు, మౌలిక వసతులు-పెట్టుబడుల శాఖలను ఇచ్చారు. టీజీ భరత్‌కు పరిశ్రమలు, వాణిజ్యం, ఆహారశుద్ధి శాఖలు, ఎస్.సవితకు బీసీ సంక్షేమం, ఆర్థికంగా వెనుకబడిన సంక్షేమవర్గాల సంక్షేమం, చేనేత జౌళి శాఖలు, వాసంశెట్టి సుభాష్‌కు కార్మికశాఖ, కర్మాగారాలు, బాయిలర్లు, వైద్య బీమా సేవలు అప్పగించారు. కొండపల్లి శ్రీనివాస్‌కు సూక్ష్మ, మధ్య, చిన్నతరహా పరిశ్రమలు, సెర్ఫ్, ఎన్నారై సాధికారత, సంబంధాలు, మండిపల్లి రామ్‌ప్రసాద్‌రెడ్డికి రవాణా, యువజన సర్వీసులు, క్రీడల శాఖలను కేటాయించారు.



# శ్రీవారి సేవకులకు విపిఆర్ దంపతుల సేవ

## వెయ్యి మందికి వస్త్ర బహూకరణ

జిల్లాలో మళ్లీ తిరుమలేశుని వైభవోత్సవాలు నిర్వహించేందుకు ప్రయత్నిస్తున్నామని నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి వెల్లడించారు. నెల్లూరు నగరంలోని స్టోన్‌హౌస్‌పేటలోని ఓ కల్యాణమండపంలో విపిఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో వెయ్యి మంది శ్రీవారి సేవలకు వస్త్రవితరణ కార్యక్రమం జరిగింది. తన సతీమణి.. కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి కలిసి ఆయన ఆ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వేమిరెడ్డి మాట్లాడుతూ, ఎంపీగా గెలిచిన తర్వాత తాను పాల్గొన్న తొలి కార్యక్రమం ఇదేనని, తొలి కార్యక్రమమే దైవ కార్యక్రమం కావడం నిజంగా సంతోషంగా ఉందని అన్నారు. ఎంపీగా తనను, నెల్లూరు సిటీ నుంచి నారాయణను అత్యధిక మెజారిటీతో గెలిపించారని ఆయన ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు. తప్పకుండా ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకునేవిధంగా తాము పనిచేస్తామన్నారు. శ్రీవారి సేవకులతో తనకు ప్రత్యేక అనుబంధం ఉందని, తాను 2016, 2022లో నిర్వహించిన వేంకటేశ్వరస్వామివారి వైభవోత్సవాలకు శ్రీవారి సేవకులు అందించిన సహకారం మర్చిపోలేనిదని చెప్పారు. త్వరలోనే మళ్లీ శ్రీ వేంకటేశ్వరస్వామివారి వైభవోత్సవాలు నిర్వహించేందుకు కృషిచేస్తున్నామన్నారు. 800 మంది మహిళలకు, 200 మంది పురుషులకు మొత్తం కలిపి వెయ్యి మంది శ్రీవారి సేవకులను గుర్తించి వి.పి.ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో దుస్తులు పంపిణీ చేయడం తమకు సంతోషంగా ఉందన్నారు. కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి మాట్లాడుతూ, ఎంపీగా వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని, కోవూరు ఎమ్మెల్యేగా తనను, సిటీ ఎమ్మెల్యేగా నారాయణను భారీ మెజారిటీతో గెలిపించిన ప్రజలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. తమను నమ్మి ఓట్లు వేసినవారికి తప్పకుండా అండగా ఉంటామన్నారు. శ్రీ వేంకటేశ్వరస్వామికి సేవ చేసిన వారికి సేవ చేసే అవకాశం తమకు కలగడం గొప్ప విషయమన్నారు. శ్రీ వేంకటేశ్వరస్వామివారికి మనం ఎంత చేస్తే... అంత మనకు తిరిగి ఇస్తారని, తప్పకుండా అందరికీ మంచి జరుగుతుందని ఆమె అన్నారు. గాదంశెట్టి సుధాకర్ నేతృత్వంలో జరిగిన ఈ కార్యక్రమంలో డెప్యూటి మేయర్ రూప్‌కుమార్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.






# ఇలాంటి మంచి గురువులు.. ఇక మళ్లీ పుట్టరేమో!..



## 'నడిచే విజ్ఞాన సర్వస్వం'..బహుముఖ ప్రజ్ఞాశాలి.. విఆర్‌సీ విశ్రాంత ఆంగ్ల బోధకులు వీఎస్సార్ అస్తమయం

***నిజమే!.. విఎస్సార్ వంటి మంచి గురువులు ఈ కలికాలంలో ఇక మళ్ళీ పుడతారా అంటే, అనుమానమే!... గురువంటే ఎవరంటే, విద్యార్థులకు పాఠాలు చెప్పడమే కాదు, అజ్ఞానమనే అంధకారం నుంచి విద్యార్థులకు జ్ఞానమార్గం చూపేవారన్నది పెద్దల మాట. అలాంటి నిబద్ధత గల ఉపాధ్యాయులు లేదా అధ్యాపకులు నానాటికీ కరువైపోతున్న నేటి కాలంలో, అక్కడక్కడా ఉన్న ఒకరిద్దరు ఉత్తమ గురువులు కూడా కాలక్రమేణా కనుమరుగైపోతుండడం బాధాకరం. నెల్లూరు విఆర్ కళాశాలలో దాదాపు నాలుగు దశాబ్దాల పాటు ఆంగ్ల బోధకునిగా అవిశ్రాంతంగా పనిచేసి, కేవలం ఇంగ్లీషు చెప్పడమే కాకుండా, తెలుగుభాష పట్ల సారస్వతం పట్ల వల్లమాలిన అభిమానంతో విద్యార్థులకు ఆ రెండుభాషల్లోనూ ఆసక్తిని, అనురక్తిని కలిగించిన మహనీయుడు.. విద్యా రుషి.. విఎస్సార్ ఈనెల 14వ తేదీ రాత్రి 8 గంటల 45 నిమిషాలకు నెల్లూరు రాయాజివీధిలోని తమ నివాసంలో తుదిశ్వాస విడిచారు. ఆయన మరణంతో నెల్లూరు.. ఆంగ్లభాషా పరిజ్ఞానం మెండుగా ఉన్న ఒక మంచి పాత తరం అధ్యాపకుడిని కోల్పోయినట్లయింది.***

అధ్యాపకత్వాన్ని ఒక పవిత్రమైన వృత్తిగా భావించి విద్యార్థులకు మార్గదర్శకమైన రీతిలో చదువు చెప్పడాన్ని కర్తవ్యంగా భావించే అధ్యాపకుల్లో.. విఎస్సార్ ఒకరు. కందుకూరు ఆయన స్వస్థలం. ఆయన పూర్తి పేరు.. వెన్నెలగంటి శ్రీనివాస రామచంద్ర రావు(విఎస్ఆర్). తల్లి పేరు రాజరత్నమ్మ. తండ్రి రామేశ్వరరావు అప్పట్లోనే సబ్‌జడ్జిగా పనిచేసేవారు. వారి కుటుంబం నెల్లూరుకు వచ్చాక, విఎస్సార్ నెల్లూరులోని విఆర్ విద్యాసంస్థల్లో ఇంటర్ దాకా చదువుకుని, ఆ తర్వాత చెన్నై లయోలా కాలేజీలో బీఎస్సీ పూర్తిచేశారు. అక్కడనుంచి నెల్లూరుకు వచ్చి తాను చదువుకున్న విఆర్‌సిలోనే ఫిజిక్స్ విభాగంలో డెమాన్‌స్ట్రేటర్‌గా ఉద్యోగంలో చేరారు. బెనారస్ హిందూ యూనివర్శిటీ నుంచి ఇంగ్లీష్‌లో ఎం.ఏ డిగ్రీ పొంది, ఆ తర్వాత ఆంగ్ల అధ్యాపకునిగా ఉద్యోగోన్నతి పొందారు. విఆర్‌సిలోనే ఉద్యోగ విరమణ పొందేవరకు, దాదాపు నలభైఏళ్ల అనుబంధం.. వేలాదిమంది విద్యార్థులకు గురువుగా, సాహితీయోధునిగా, నెల్లూరుజిల్లా చరిత్రకు సంబంధించి ఎలాంటి సందేహాలు వచ్చినా నివృత్తిచేసే చారిత్రికునిగా ఆయన పేరెన్నికగన్నారు. దేశంలో అత్యున్నత శిఖరాలందుకున్న ముప్పవరపు వెంకయ్యనాయుడు, శాంతా బయోటెక్నిక్స్ అధినేత.. పద్మభూషణ్ గ్రహీత డా. వరప్రసాద్‌రెడ్డి, మాజీ ముఖ్యమంత్రి స్వర్గీయ నేదురుమల్లి జనార్దన్ రెడ్డి, ప్రముఖ విద్యావేత్త.. దివంగత కేవీ రత్నం వంటి ప్రముఖులెందరో ఆయన వద్ద ఆంగ్ల పాఠాలు నేర్చుకున్నవారే. ఉద్యోగ విరమణ తర్వాత కోరా, రత్నం విద్యాసంస్థల్లో కొంతకాలం అధ్యాపకునిగా, ప్రిన్సిపాల్‌గా వ్యవహరించారు.

### క్రికెట్ అంటే ఎంతో ఇష్టం :

విఎస్సార్‌కు క్రికెట్ అంటే ఎంతో ఇష్టం. ఆయనో మంచి క్రికెట్ క్రీడాకారుడు కూడా. ఆంధ్ర క్రికెట్ అసోసియషన్ ఉపాధ్యక్షునిగా, సౌత్‌జోన్ కార్యదర్శిగా, రంజీ ట్రోఫీ క్రీడాకారులను ఎంపికచేసే సెలెక్టర్‌గా కూడా వ్యవహరించారు. లయన్స్ క్లబ్ సభ్యునిగా ఉంటూ పేద విద్యార్థుల అభ్యున్నతికి కృషిచేశారు. ఆయనకు ఒక కుమారుడు, ఒక కుమార్తె ఉన్నారు. ఆయన మరణంతో సహచరులు, అధ్యాపకులు, కుటుంబసభ్యులు శోక తప్తులయ్యారు. మాస్టారు మృతికి నివాళు లర్పిస్తోంది 'లాయర్'.

### ఆయన సేవలు మార్గదర్శకం - వెంకయ్యనాయుడు సంతాపం

నెల్లూరు విఆర్ కళాశాల విశ్రాంత సీనియర్ ఆంగ్లబోధకులు విఎస్ రామచంద్రరావు సేవలు మార్గదర్శకమని భారత పూర్వ ఉప రాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు ఒక ప్రకటనలో సంతాపం ప్రకటించారు. ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ పూర్వ ఉపాధ్యక్షులుగా, కోరా జూనియర్ కాలేజీ ప్రిన్సిపల్‌గా ఆయనందించిన సేవలు, ఆయన జీవనవిధానం యువతకు స్ఫూర్తిదాయకమని కొనియాడారు. వ్యక్తిగతంగా తన పట్ల ఆయనెంతో అభిమానం చూపేవారని, విఎస్ఆర్ మృతి బాధాకరమని పేర్కొన్నారు.

# చెరిగిపోని చేవ్రాలు శివకుమార్ పేరిశెట్ల 'మొలగొలుకు చేను'

విలక్షణమైన అభివ్యక్తి, వినూత్న పదప్రయోగాల తీవ్రశక్తి, భావ కలశాల యుక్తి, విశేషమైన, విశిష్టమైన శ్రద్ధతో పల్లెసీమల నుడికారాల్లో జీవించి, ఆ పల్లె అవతారికల్ని చేపట్టి, తన కవితామయ సందేశంతో, పటిమతో రూపొందించిన 'మొలగొలుకు చేను' సమర్థవంతమైన సాహితీ సంపుటిగా భాసిల్లింది. కల్మషం ఎరుగని పల్లెజీవుల అంతరంగాల్ని చిత్రిక పట్టింది. నెల్లూరు నుడికారపు పల్లె భాషలోని సొగసుల్తో చూడ చక్కగా అమరింది. వరికంకుల తియ్యందనాల రుచుల్ని మనకు చవిచూపింది. కవిత్వం పట్ల అవ్యాజానురాగంతో, గౌరవంతో సాగిన మొలగొలుకుల చేను నెల్లూరు మొలగొలుకులతో చేపల పులుసు వేసుకొని భుజించిన అనుభూతిని మిగిల్చిందంటే ఆశ్చర్యం కాబోరదు.

డాక్టరుగా వృత్తిలో ప్రజాసేవ చేస్తూ, సాహితీ సేవకు పెద్దపీట వేసిన ప్రియంభావకుడు పేరిశెట్ల శివకుమార్ కవిత్వంలో జీవం తొణికిసలాడిందంటే అతిశయోక్తి లేదు. ఈ కవితాసంపుటిలోకి దూరితే పల్లె గుభాళింపుల్లోకి పరకాయ ప్రవేశం చేయిస్తుంది. తొలి కవితాసంపుటితోనే మంచి కవిగా ముద్రవేసుకున్న శివకుమార్ పేరిశెట్ల అభినందనీయులు.

రైతును నేల బిడ్డగా సృజించి, నేల బిడ్డ కన్నీటిసుక్క పాలయితే... ఆకలి పాతమే మిగులుతుందని ఆవేదన వెలిబుచ్చుతారు. 'భూమిని దున్నే బుద్ధుడు'గా రైతును కవి అభివర్ణిస్తూ భూమిపుత్రుల దండయాత్రలపై ఈ కవిత ఈ పుస్తకానికే తలమానికంగా ఉంది. 'దోసిట్లో పడ్డ బువ్వలా ఉండే రైతు అణిగిమణిగిన తత్వాన్ని' కళ్ళ ముందు ప్రదర్శించి, ఆ రైతు పిడికిలెత్తి వీధికెక్కిన సందర్భాన్ని గుర్తుచేస్తారు కవి.

రైతును గురించి మరో పాదంలో 'పూరిపాకను అల్లుకొన్న సొరచెట్టులాంటి రైతు వాయుగుండం తాకిన వైజాగయ్యేడే' అనే గొప్ప ఉపమానంతో అల్లకల్లోలమైన రైతు స్థితిని చిత్రంగా చూపిస్తాడు. ఎంత గొప్ప పోలికో కదా!

తొండలు గుడ్లుపెట్టే బీళ్ళను తోట చేనుగా మార్చేవాడు రైతు అనేదీ కొత్త ప్రయోగమే! ఆకలి మంటలకు అన్నం పెట్టేటోడు ఆరని మంటల చిచ్చు పాతరై ఘనీభవించాడంటారు కవి, రైతు దీనస్థితికి అద్దంపడ్తూ!

పల్లె భాషలో కవిత్వం రాయడం, పల్లె వాతావరణ వేకువల్ని సృజించడం కొందరికే సాధ్యం. శివకుమార్ కవికి అది పెన్నుతో పెట్టిన విలువిద్యలా కన్పిస్తుంది. పెన్నానది మీద రాసిన 'పిచ్చి పెన్నమ్మ' కవితలో కొత్త కొత్త పోలికలు విందు చేస్తాయి. మనల్ని పరుగెత్తించి చదివిస్తాయి.

ఓ వాక్యంలో 'నీటి సుట్టాలంటారు' కవి. నీటి దేవుళ్ళు లేకపోతే మనకు మిగిలేవి కన్నీళ్ళే కదా సామి! అలాగే చెరువు చెల్లెమ్మల్ని వెంటేసుకొని, వాగు తమ్ముళ్ళను త్రోసుకొని ఉరకల పరుగుల మీద పరవశిస్తుంది పెన్నమ్మ. రైతుల కన్నీటి కథల్ని బాపే చిన్నమ్మ అని ఆనందపరవశులవుతారు కవి. ఇదో కొత్త భావనా బలమే కదా కవితకు. కవి డాక్టరు కావడంతో కొత్త కొత్త ప్రయోగాల జిమ్మిక్కుల వైటమిన్లు అందించి బలవర్ధకం చేసిన ఘటన మనకు కన్పిస్తుంటుంది.

వరద ఉధృతిని అభివర్ణిస్తూ 'అంతా అయిపోయినాక అధికారులిచ్చే నాలుగు బీపుగింజలతో పూట గడుస్తుంది' కానీ అపరకాళిక అయిన పెన్నమ్మ ఉగ్రరూపం తగ్గేదెట్లోనని వాపోతారు కవివర్యులు. సోమశిలేశ్వరుడి కౌగిలిని వీడి కడలితో కాపురం చెయ్యడానికి పెన్నమ్మ దూకుడుమీదుంది అనే మాటతో పెన్నమ్మను 'పెర్సానిఫై' చేసిన కవి వింత భావనతో ఆ కవిత ఎంతో ఆకట్టుకొంది.


జాషువా మీద రాసిన 'ప్రశ్నించే పద్యం' కవితలో, గబ్బిలం జాషువా చేత గండపెండేరం తొడిగించుకొన్నదంటారు... జాషువా రాసిన 'గబ్బిలం' కవితా సంపుటిని ప్రస్తావిస్తూ! అదొక జాను తెలుగు జాళువా! సరికొత్త శైలీ జలాన్ని నింపుకొన్న తీరువా, ఆయనే కవికోకిల జాషువా అని తనదైన అభిమానంతో జాషువా కవిని అభిషేకిస్తారు, ఆరాధిస్తారు కవివర్యులు. 'పద్యానికి పౌరాణిక వేషాన్ని తొలగించి, సామాజిక బాధ్యతను నేర్పిన నవయుగ కవిచక్రవర్తి, వైతాళికుడు జాషువా అని తానూ శిరసు వంచి నమస్కరించి మన చేత కూడా నమస్కరింపజేయడం ఈ కవి ప్రత్యేకత!

'మా ఊరి మందల' ఈ కవితా సంపుటిలోని తొలి కవిత. ఒకప్పటి నాటు రైతుకు, వరి పండించే రైతుకు, నేటి యినామీ రొయ్యల్ని ఏడాది పొడుగునా తినిమరిగి 'ఖుషీ' అయిపోయిన రైతుకు మధ్య 'వైరస్' వైవిధ్యాన్ని జనం దృష్టికి తెచ్చి మూడోకన్ను తెరచిన శివుడు, సార్థక నామధేయుడు శివకుమార్.

కవిగా శివకుమార్‌కు ఎంతో ఉజ్వల భవిత ఉందని ఆయన రాసిన మొలగొలుకుల కవిత ఋజువు చేస్తుంది. రెండు చిన్న చిన్న పుస్తకాలు ప్రచురించినా తెలుగు సాహితీ యవనికపై చెరగని చేవ్రాలు 'మొలగొలుకు చేను' కవితా సంపుటిగా కవి శివకుమార్‌ను అభినందిస్తున్నాను.

'తన ప్రాణమంత', 'మొలగొలుకు చేను', 'రెక్క' ఇలా చాలా చక్కని కవితలు ఇందులో ఉన్నాయి.

**- చిన్ని నారాయణరావు, సెల్: 9440202942**




**మొలగొలుకు చేను**
రచయిత: **శివకుమార్ పేరిశెట్ల**
వెల: రూ. 150/-
ప్రతులకు : శివకుమార్ పేరిశెట్ల
మైపాడు, ఇందుకూరుపేట మం.
ఎస్‌పిఎస్ఆర్ నెల్లూరుజిల్లా - 524313.
సెల్: 9866793210

# తిరుపతి జిల్లా గూడూరు డివిజన్

## గూడూరు అభివృద్ధికి సహకరించండి

### మంత్రి నారాయణని కలిసి విన్నవించిన ఎమ్మెల్యే పాశం




రాష్ట్ర పట్టణ మరియు పురపాలక శాఖామంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన అనంతరం తొలిసారిగా నెల్లూరుకు విచ్చేసిన డాక్టర్ పొంగూరు నారాయణను ఈ నెల 15వ తేదీన ఆయన క్యాంపు కార్యాలయంలో గూడూరు ఎమ్మెల్యే డాక్టర్ పాశం సునీల్‌కుమార్ కలిసి పుష్పగుచ్ఛం అందజేసి, శాలువాతో ఘనంగా సన్మానించారు. అనంతరం సునీల్ కుమార్ మంత్రి నారాయణని గూడూరు నియోజకవర్గ అభివృద్ధికి తోడ్పాటు అందించాలని, గత 13సంవత్సరాల నుండి అసంపూర్తిగా ఆగిపోయిన ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మాణ పనులు వేగంగా జరిగేలా నిధులు కేటాయించి, త్వరగా బ్రిడ్జి నిర్మాణం పూర్తిచేసి గూడూరు ప్రజలకు మీ ద్వారా అంకితం చేయాలని ఆయన కోరారు. ఇందుకు స్పందించిన మంత్రి నారాయణ, గూడూరు అభివృద్ధికి తనవంతు సహాయసహకారాలు తప్పకుండా అందిస్తానని హామీ ఇచ్చారు. టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

### కొండా కాశీ ఆధ్వర్యంలో

## బ్రాహ్మణ దంపతులకు పట్టువస్త్రాలు

- అందజేసిన తెలంగాణ డెప్యూటీ సీఎం భట్టి విక్రమార్క



తెలంగాణ రాష్ట్రంలోని ప్రజా భవన్‌లో ఆ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క జన్మదిన వేడుకలను ఈ నెల 15న ఘనంగా నిర్వహించారు. గూడూరు పట్టణానికి చెందిన ప్రముఖ పారిశ్రామికవేత్త కొండా కాశీ ఆధ్వర్యంలో 108 మంది బ్రాహ్మణ దంపతులతో ఆశీర్వచనం కార్యక్రమం నిర్వహించారు. అనంతరం మల్లు భట్టి విక్రమార్క దంపతుల చేతులమీదుగా 108 మంది బ్రాహ్మణ దంపతులకు పట్టు వస్త్రాలను అందించారు. అలాగే భారీ అన్నదాన కార్యక్రమం కూడా నిర్వహించారు. ఈ సందర్భంగా కొండా కాశీ మాట్లాడుతూ భవిష్యత్తులో ఆయన మరెన్నో జన్మదిన వేడుకలను ఆనందంగా కుటుంబసభ్యుల నడుమ నిర్వహించుకోవాలని ఆకాంక్షించారు. సంపత్, కార్తిక్‌రెడ్డి, రోహన్, రాజేంద్ర, రవి, రోహన్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# నేతలకి విలాసం... పేదలకి విలాపం

"రాజుల సొమ్ము రాళ్ల పాలు" ఇది పాత సామెత. రాజ్యాలను ఏలిన రాజులు అవసరంలేని, అనవసరమైన కట్టడాలతో ఖజానా సొమ్ము వృథా చేసేవారన్న మాట నుండి పుట్టుకొచ్చిన మోటు సామెత ఇది. రాజులందరూ అలా ఉంటారని కాదు. చాలా మంది రాజులు సమాజానికి ఉపయోగకరమైన నిర్మాణాలు కూడా చేయించారు. విజయనగర సామ్రాజ్యాధీశులు, కాకతీయ చక్రవర్తులు వంటి అనేకమంది చెరువులు తొవ్వించడంతో పాటు ఎన్నో ప్రజోపయోగ కట్టడాలను కూడా నిర్మించారు.

రాచరిక వ్యవస్థ పోయి ప్రజాస్వామ్య వ్యవస్థలో మనం బతుకుతున్నా, కొంతమంది మాత్రం ఇంకా తమను తాము మహాచక్రవర్తుల్లా భావించుకుంటూ విలాసాల కోసం విచ్చలవిడిగా సొమ్ము ఖర్చు చేస్తున్నారు. అందుకే, "ప్రజల సొమ్ము జల్సాల పాలు" అనేది నేటి సామెతగా మారింది. సొంత డబ్బయితే ఫర్వాలేదు, ప్రజాధనాన్ని తమ విలాసాల కోసం ఖర్చు చేయడమే తీవ్ర అభ్యంతరకరం.



## 'జగన్ కొండ'గా మారిన 'రిషికొండ'...

ఏ మాంత్రికుడు అంజనం వేసి చెప్పాడో, ఏ మఠాధిపతి శాస్త్రాలు తిరగేసి చెవిలో ఉపదేశించాడో, ఏ హస్త సాముద్రికుడు అరచేతిలో స్వర్గం చుపించాడో కానీ 30 ఏళ్ల పాటు ముఖ్యమంత్రిగా తానే అధికారంలో ఉంటానని ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అనుకున్నారు. విశాఖ నుంచే తన పరిపాలన ఉంటుందని మొన్నటి ఎన్నికలకు ముందు ఒక టీవీఛానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో సెలవిచ్చారు. ప్రజల జీవన ప్రమాణాలు పెంచకపోయినా బటన్ నొక్కి చిల్లర పారేస్తున్నాను కాబట్టి ఈవీఎం బటన్ కూడా తనకు అనుకూలంగా నొక్కుతారని ఆయన ఊహించారు. మళ్ళీ తానే రాష్ట్రానికి రాజునని భావించి విశాఖలోని రుషికొండపై విలాసవంతమైన భవనాలను కట్టించారు.

## రూ.కోట్ల వ్యయంతో స్నానపు గదులు

పేదలకు పట్టెడన్నం పెట్టే అన్న క్యాంటిన్లను ధ్వంసం చేయించిన జగన్ ప్రభుత్వం, ఆయన నివాసం కోసం, సచివాలయం కోసం రాష్ట్ర పర్యాటక శాఖ ఆధ్వర్యంలో ఏకంగా 452 కోట్ల రూపాయలతో ఏడు భవనాలను కట్టించింది. వాటిలో నివాస భవనాలు మూడు. మూడింటిలోనూ కలిపి పడక గదులు పన్నెండు. ప్రతీ పడక గదికి అంతర్భాగంగా అత్యంత విలాసవంతమైన స్నానాల గదులున్నాయి. ఒక్కో స్నానాల గది వైశాల్యం ఒక పేదవాడి ఇల్లంత. విపక్ష నేతలను పెత్తందార్లని, తాను మాత్రం పేదల పక్షపాతి అయిన అత్యంత సామాన్యుడినన్నట్లు ఎంతో నాటకీయత పండిస్తూ మాట్లాడే జగన్‌మోహన్‌రెడ్డే అసలు సిసలు పెత్తందారని, ఈ విలాసాల నిర్మాణాలను బట్టి ఎవరికైనా అర్థమవుతుంది. పేదల ఇళ్ల కోసం జగన్ ప్రభుత్వం ఇచ్చింది సెంటు భూమి. దానిలో గరిష్ఠంగా 430 చదరపు అడుగుల ఇల్లు కట్టుకోగలరు. కానీ రుషి కొండపై జగన్ ప్రభుత్వం కట్టించిన స్నానాల గది వైశాల్యమే 480 చదరపు అడుగులు. అంటే జగన్ కోసం కట్టించిన స్నానాల గదంత కూడా పేదవాడి ఇల్లుండదన్న మాట.

## 'కొండపై జగనోరు.. కొండ కింద పేదోరు'

వైశాల్యం సంగతి పక్కనపెడితే రాష్ట్రంలో జగన్ ప్రభుత్వం పేదజనం కోసం పంపిణీ చేసిన స్థలాలు చాలావరకు నిర్మాణానికి అనువుకానీ చోట్లే ఉన్నాయి. కాస్త వర్షం వస్తే చెరువుల్లా మారిపోయే పల్లపు ప్రాంతాల్లో ఉన్నాయి. కానీ, జగన్ నివాసం కోసం మాత్రం ఎత్తైన ప్రదేశంలో కొండపై పర్యావరణాన్ని ధ్వంసం చేసి మరీ విలాసవంతమైన భవంతులు కట్టారు. కొండపై జగనోరు.. కొండ కింద పేదోరు అన్నమాట.

## అసలు మతలబు ఏమిటో.. అందరికీ తెలుసు

కళ్లు చెదిరే అలంకరణతో, ఖరీదైన ఫర్నిచర్‌తో భవంతులు ఇప్పటికే సిద్ధమైపోయాయి. ప్రజలు జగన్‌మోహన్‌రెడ్డిని కుర్చీ నుంచి దించేసిన తర్వాత ఇప్పుడు ఆయన అనుంగులైన మాజీ మంత్రులు, ఇతర నేతలు అబ్బే... అవి జగన్ కోసం కాదు.. రిసార్టులే, విశాఖకు వచ్చే రాష్ట్రపతి, ప్రధాని వంటి విశిష్ట అతిథుల కోసం, పెట్టుబడులు పెట్టడానికి వచ్చేవారి కోసం వాడుకోవచ్చు కదా అని సమర్థించుకుంటున్నారు. కానీ అసలు వాస్తవం... రాజ ప్రాసాదాల్లాంటి భవంతులు తమ అప్రకటిత చక్రవర్తి జగన్ కోసమేనన్నది వారికీ తెలుసు. ఐఏఎస్ అధికారి శ్రీలక్ష్మి కమిటీ, రుషికొండపై భవనాలు ముఖ్యమంత్రి నివాసానికి అనుకూలమని చేసిన సిఫార్సు వెనక మతలబు ఏమిటో అందరికీ తెలుసు. ఒకవేళ ఆ భవంతులు వారు చెప్పినట్లు విశిష్టఅతిథుల కోసమే అయితే, ఆ విషయం గతంలో ఎప్పుడూ ఎందుకు చెప్పలేదన్న ప్రశ్నకి వారి వద్ద సమాధానం లేదు. నిజంగా అటువంటి అతిథుల కోసమే అయితే నాణ్యమైన ఫ్యాన్లతో సరిపెట్టకుండా అలంకార పూరితంగా ఉన్న ఫ్యాన్లు ఎందుకు? మసాజ్ బల్లలెందుకు? దీన్ని బట్టే ఆ భవంతులు ఎవరి కోసమో అర్థమయిపోతోంది. పైగా ఏపీటీడీసీ రిసార్టులకు ఆధునిక హంగులు అద్దుతున్నామని చెప్పిన అప్పటి ప్రభుత్వం వాటిని తొలగించి, అక్కడ కొత్తగా నిర్మాణాలు చేపట్టింది.

## 450 కోట్లంటే... ఆయనకి చిల్లరతో సమానం

జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వానికి 450 కోట్ల రూపాయలంటే చిల్లరగా కనిపించినట్లుంది. అంత పెద్ద మొత్తంతో చాలా మంచి పనులు చేయవచ్చు. కొన్ని గ్రామాల రూపురేఖలే మార్చేయవచ్చు. బిల్లులు రాక అల్లాడుతున్న కాంట్రాక్టర్ల కుటుంబాలని ఆదుకోవచ్చు. రాష్ట్రంలో అనేక చోట్ల గతుకులతో, అతుకులతో గుంతల మయంగా ఉన్న రోడ్లని బాగుచేయొచ్చు. నీటి పారుదల కాలువలు తొవ్వించవచ్చు. సరైన వసతులు లేక కొన్ని వందల ప్రాణాలను బలి తీసుకుంటున్న ప్రభుత్వ ఆసుపత్రులలో ఆధునిక సౌకర్యాలు కల్పించవచ్చు. ఇలా చెప్పుకుంటూ వెళ్తే... ఎన్నో సంక్షేమ కార్యక్రమాల కోసం ఆ సొమ్ముని వినియోగించుకొనివుండవచ్చు. నీతికి నిజాయతీకి ప్రతీకగా నిలచిన మాజీ ఐఏఎస్ అధికారి ఐవీఆర్ కృష్ణారావు ఒక ఇంటర్వ్యూలో మాట్లాడుతూ "గడిచిన అయిదేళ్ల అరాచక పాలనలో జరిగిన వికృత చర్యల్లో ఇదొకటి" అని రిషికొండ నిర్మాణాలపై వ్యాఖ్యానించారంటే ఈ నిర్మాణాలు ఎంతటి అనాలోచిత చర్యో మనం ఊహించుకోవచ్చు. 'నేతలకి విలాసం – పేదలకి విలాపం' అన్నట్లుగా జగన్ చేపట్టిన ఈ భారీ స్వగృహ నిర్మాణాన్ని ఈ శతాబ్దపు అత్యంత హేయమైన చర్యగా పేర్కొనక తప్పదు..!!



**తుమ్మల బాల గంగాధర్ తిలక్**

---



## జానకిరామ.. రామాయణం (18)

**- ఊటుకూరు జానకి రామారావు**

రాముడికి కోపం కలిగినా అనుగ్రహం కలిగినా అవి వ్యర్థంగావు.

చంపదగినవానిని చంపితీరుతాడు, చంపతగని వారి విషయంలో అసలు కోపం వహించడు!

ఎవడినైతే అనుగ్రహించాడో వాడు ఈ లోకంలో అందరికన్నా ఐశ్వర్యవంతుడవుతాడు!

**రామమ్ ఇన్దీవరశ్యామమ్ సర్వశత్రు నిబర్హణమ్...**

నల్ల కలువ వలే ఉండే రాముడు శత్రుసంహారకుడు!

అసలిన్నెందుకు! లోకంలోని శ్రేష్టమైన గుణాలన్నీ ఎవరిలో ఉన్నాయి అని అడిగితే... అందరి చూపుడు వేలు రాముడివైపు తిరుగుతుందట!

ఇన్ని ఆలోచనలు మదిలో తిరుగుతూ ఉన్న దశరథమహారాజు ఈ లోకంలోకి వచ్చి పడ్డాడు **"రామవర్మాహం అహంభో అభివాదయే"** అన్న రాముని మాటలతో!.

రామా! పుష్యమీ నక్షత్రఘడియలలో నిన్ను యౌవరాజ్యపట్టాభిషిక్తుడిని గావింప నిశ్చయించాను !

రామా! నీవు ఇకనుండి ఇంకా జాగ్రత్తగా మెలగవలె!

నీవు ఇంకా వినయవంతుడవై ఎల్లప్పుడును ఇంద్రియాలను అదుపులో పెట్టుకొని కామం వలన కలిగే వ్యసనాలకు, క్రోధం వలన కలిగే వ్యసనాలకు దూరంగా ఉండు, ధాన్యాగారాలను, ఆయుధాగారాలనూ ఎల్లప్పుడూ చక్కగా నింపి ఉంచు.

ప్రజలను, అమాత్యులను ఎల్లప్పుడూ సంతోషంగా ఉంచు! అని హితవు పలికాడు దశరథమహారాజు.

ఇంత సంతోషకరమైన వార్తను కౌసల్యాదేవికి చేరవేశారు రాముని మిత్రులు.

(మన స్మృతులు ఈ విధంగా చెపుతున్నాయి...

కామం వలన కలిగే వ్యసనాలు.. పది. అవి...

వేట, జూదము, పగటినిద్ర, పరుల దోషాలు వినడం చెప్పడం, పరస్త్రీ సంభోగం, తాగుడు, నృత్యము, గీతం, వాద్యం, పనీపాట లేకుండ దేశసంచారం చేయడం ఇవ్వన్నీ వ్యసనాలే.

BE MERRY BE HAPPY CULTURE

ఇక కోపం వలన కలిగే వ్యసనాలు...

చాడీలు చెప్పడం complaining mentality

సత్పురుషులను బంధించడం, బాధించడం, ద్రోహం, ఈర్ష్య, అసూయ, ప్రక్కవాడి డబ్బు కాజేయడం, వాక్పారుష్యమ్ అనగా ఊరకే ఎదుటివాడిని తిట్టిపోయడం, దండపారుష్యమ్ అనగా ఎదుటివాడిని కొట్టటం.

వీటన్నిటికీ దూరంగా ఉండమని హితవు పలుకుతున్నాడు దశరథుడు!)

అద్దంలో తన ప్రతిబింబం తనే తనివితీరా చూసుకునే విధంగా తన ఎదురుగా నిలబడ్డ రాముని కనులారా చూసుకున్నాడు.

ఆయనను ప్రేమగా దగ్గరకు తీసుకుని గుండెలకు హత్తుకున్నాడు దశరథమహారాజు!

చెప్పవలసిన అన్ని విషయాలు చెప్పాడు !

రామచంద్రుడు తండ్రివద్ద సెలవు తీసుకొని తల్లి మందిరానికి బయలుదేరాడు.

ఆయన అటు వెళ్ళాడో లేదో మరల దశరథుడి మనసులో ఏదో ఆందోళన, చెప్పలేని ఏదో తెలియని ఆవేదన, మరల సుమంత్రుని పిలిచాడు రాముని మరియొక్కసారి శీఘ్రంగా ఇక్కడికి తీసుకురా! అని ఆజ్ఞాపించాడు.

రాజాజ్ఞ పాటించాడు సుమంత్రుడు.

తండ్రికి ఎదురుగా కూర్చుని మరల నన్ను పిలిపించారెందుకు? అన్నట్లుగా చూశాడు రామచంద్రుడు!.

దశరథుడప్పుడు, నాయనా! నీ పట్టాభిషేకమహోత్సవం ఎంత త్వరగా జరిగితే అంత మంచిది, నాకెందుకో అమంగళకరమైనదేదో జరుగబోతున్నదనిపిస్తుంది, శకునాలు కూడా అవే చెప్తున్నాయి. క్రూర గ్రహాలు రవి, కుజ, రాహువులు నా జన్మ నక్షత్రాన్ని ఆక్రమించినట్లు దైవజ్ఞులు చెపుతున్నారు.

ఇవ్వన్నీ చూస్తుంటే నాకు మృత్యువైనా సంభవించవచ్చు లేదా అంతటి గొప్ప ఆపద అయినా కలుగవచ్చు.

నాయనా నేను ఈ లోకంలో జన్మించినందుకు అన్ని సుఖాలు అనుభవించాను, క్షత్రియధర్మాలన్నీ నెరవేర్చాను!

దేవ ఋణం, ఋషి ఋణం, పితృదేవతా ఋణం, బ్రాహ్మణ ఋణం అన్నీ తీర్చివేశాను.

ఇక నీకు రాజ్యాభిషేకం చేయడమొక్కటే నేను చేయవలసిన పని.

మనిషి మనసు చంచలమయినది, ఏ నిమిషానికి అది ఏమి ఆలోచిస్తుందో ఏమి జరుగనుందో ఎవరికీ తెలియదు! నా మనస్సులో వేరొక ఆలోచన రాక పూర్వమే నీకు పట్టాభిషేకం జరుగవలె!

భరతుడు ఈ నగరంలో లేనప్పుడే నీకు పట్టాభిషేకం జరుగవలెనని



నా అభిప్రాయం.

సోదరుని గూర్చి ఇదేమి ఆలోచన తండ్రీ! అని అడుగుతావేమో!

ఆతడు ధర్మాత్ముడే!

నిన్ను అనుసరించి ఉండేవాడే, ఇంద్రియ నిగ్రహం కలవాడే, సత్పురుషులు వెళ్ళే దోవలో చరించేవాడే, దయాశీలుడే... కానీ... ఎంతటి వాడి మనస్సయినా చంచలం నాయనా !

ఈరోజు చంద్రుడు పునర్వసు నక్షత్రంలో ఉన్నాడు, రేపు పుష్యమితో కూడుతాడు. రేపు సరి అయిన సమయమని దైవజ్ఞులు చెప్తున్నారు.

ఇక నీవు వెళ్ళిరా అని అనుమతించాడు.

రాముడు తల్లి మందిరం చేరుకున్నాడు, అప్పటికే ఈ వార్త విని సుమిత్ర, లక్ష్మణుడు అక్కడికి చేరుకున్నారు!

సీతను కూడా రప్పించారు.

(యజ్ఞాలు చేస్తే దేవతా ఋణం

స్వాధ్యాయాధ్యయనాలు చేస్తే ఋషిఋణం

సంతానం కనటం వల్ల పితృఋణం

దానాదులచేత బ్రాహ్మణ ఋణం... తీరుతాయి

ఈ పనులన్నీ సమృద్ధిగా చేశాడు దశరథ మహారాజు.)

అమ్మా, నాన్న గారి ఆజ్ఞ ప్రకారం రేపు నాకు రాజ్యపట్టాభిషేకం!

మేమిరువురం దీక్షలో ఉండవలెనని రాజపురోహితులు తెలిపినారు, అందుకు అవసరమైన కార్యక్రమాలు నీ చేతుల మీదుగా జరిపించమ్మా అని వినయంగా తల్లిని ప్రార్థించాడు కౌసల్యానందనుడు!.

నాయనా నా చిరకాలపు నోములన్నీ ఫలించినవిరా నేడు!

నీవు మహారాజువై ఈ వసుంధరను పరిపాలించాలని ఆ శ్రీ మహావిష్ణువుకు నేను పెట్టుకొన్న మొరలాలకించాడురా ఆ దేవదేవుడు! అని దగ్గరకు తీసుకున్నది కౌసల్య తన ప్రియ పుత్రుడిని.

.. (సశేషం)



# ఈ విజయం.. మీకే అంకితం!

## • కార్యకర్తల ఆత్మీయ సభలో విపిఆర్ దంపతులు

టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు, కార్యకర్తల సమష్టి కృషి ఫలితంగానే తాము ఎంపీగా, ఎమ్మెల్యేలుగా గెలవగలిగామని, ఈ విజయం కార్యకర్తలకు, ప్రజలకు అంకితం చేస్తున్నామని విపిఆర్ దంపతులు చెప్పారు. ప్రజల ఆశీర్వాదాలతో ప్రజా ప్రతినిధులైన తమపై మరింత బాధ్యత పెరిగిందన్నారు. ఈనెల 18న నెల్లూరు సమీపంలోని విపిఆర్ కన్వెన్షన్ సెంటర్‌లో వేలాదిమంది ప్రజలు, అభిమానుల మధ్య కోవూరు నియోజకవర్గ టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తల ఆత్మీయ సమావేశం ఎంతో కోలాహలంగా జరిగింది. ఈ సందర్భంగా వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ, తమను భారీ మెజారిటీతో గెలిపించిన ప్రజల రుణం తీర్చుకునేందుకు వారికి ఇచ్చిన హామీలను తప్పకుండా నెరవేరుస్తామన్నారు. తమకు అబద్దాలు చెప్పడం తెలియదని, తనకు తెలిసిందల్లా ప్రజలకు ఇచ్చిన మాట నిలబెట్టుకోవడమేనని ప్రజల హర్షధ్వానాల మధ్య అన్నారు. పొంగూరు నారాయణ, ఆనం రామనారాయణరెడ్డిలు అపార అనుభవమున్న మంత్రులని ఆయన అంటూ, కేంద్ర ప్రభుత్వాన్ని ఒప్పించి ఇఫ్కో కిసాన్ సెజ్, కేంద్ర రక్షణ శాఖకు సంబంధించిన మిధాని ప్రాజెక్టులు సాధించి కోవూరు యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్నారు. వయసులో చిన్నవారైనా పోలంరెడ్డి దినేష్‌రెడ్డి పరిణతి చెందిన నాయకుడని, దినేష్‌రెడ్డి తనకు బిడ్డలాంటివాడని ఎంపీ వేమిరెడ్డి అన్నారు. కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి మాట్లాడుతూ ఎన్నో ఒత్తిళ్ళు, అడ్డంకులు, అవాంతరాలు ఎదురైనా వెన్ను చూపి పారిపోకుండా తన వెన్నంటి ఉండి తనను అఖండ మెజారిటీతో గెలిపించిన ఎన్డీఏ కార్యకర్తలు, కోవూరు ప్రజానీకానికి తన విజయాన్ని అంకితం చేస్తున్నానన్నారు. ఎన్నికల సందర్భంగా చేసిన ప్రతి వాగ్దానం నెరవేర్చేందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తానన్నారు. మండే ఎండల్లో కార్యకర్తలు పడ్డ కష్టం తనకు తెలుసని, తన విజయం కోసం పని చేసిన ప్రతి కార్యకర్తకు న్యాయం చేసేందుకు కృషి చేస్తానని చెప్పారు. ఈ ఎన్నికల్లో తన విజయానికి మాజీ ఎమ్మెల్యే పోలంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, పోలంరెడ్డి దినేష్‌రెడ్డిల సహకారం గొప్పదన్నారు. టిడిపి జిల్లా అధ్యక్షులు అబ్దుల్ అజీజ్, మాజీ ఎమ్మెల్యే పోలంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, టీడీపీ జాతీయ అధికార ప్రతినిధి పోలంరెడ్డి దినేష్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి చేజర్ల వెంకటేశ్వర్లురెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షులు వంశీధర్ రెడ్డి, జనసేన కోవూరు ఇన్‌చార్జ్ హరిరెడ్డి తదితరులు మాట్లాడారు.



తెలంగాణ అవతరణ దినోత్సవం సందర్భంగా ఇటీవల చెన్నై రాజ్‌భవన్‌లో జరిగిన కార్యక్రమంలో పాల్గొని ప్రసంగించిన అఖిల భారత తెలుగు సమాఖ్య అధ్యక్షులు, చెన్నైలోని తెలుగువారి పెద్దదిక్కు డాక్టర్ సి.యం.కె.రెడ్డిని సత్కరిస్తున్న తమిళనాడు గవర్నర్ ఆర్.ఎన్.రవి. ఇదే సందర్భంగా గవర్నర్‌ని అభినందిస్తున్న డా. సి.యం.కిషోర్



## కాలం బుజ్జిరెడ్డికి..వెంకయ్య నివాళి

బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి, ఆత్మకూరు నియోజకవర్గ ఇన్‌చార్జి కాలం బుజ్జిరెడ్డి మరణానికి చింతిస్తూ భారత పూర్వ ఉపరాష్ట్రపతి ముప్పవరకు వెంకయ్యనాయుడు ఇటీవల ఒక ప్రకటనలో తన సంతాపం తెలిపారు. బుజ్జిరెడ్డి తనకెంతో ఆత్మీయుడని తన పట్ల ఎంతో అభిమానం, గౌరవంతో ఉండేవారని పేర్కొన్నారు సంఘ్ నుంచి స్వయంసేవక్‌గా జీవితాన్ని ప్రారంభించి కలుపుగోలుగా ఉంటూ అందరి అభిమానాన్ని పొందిన బుజ్జిరెడ్డి మరణం తనకెంతో బాధను కలిగిస్తోందని, ఆయన ఆత్మకు శాంతి కలగాలని ఆ భగవంతుడిని ప్రార్థిస్తున్నానని తెలిపారు.

## మూడో రైల్వేలైన్‌కు కేంద్రం గ్రీన్ సిగ్నల్

కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర ప్రజలకి ఇటీవల శుభవార్త వినిపించింది. రాష్ట్రంలో మూడవ రైల్వేలైన్ నిర్మాణానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. గూడూరు – రేణిగుంట రైల్వే మార్గం మధ్య మరో కొత్త రైల్వేలైన్ ఏర్పాటుకు ఆమోదం తెలిపింది. ప్రధానమంత్రి గతిశక్తి యోజన కార్యక్రమం క్రింద జాతీయ స్థాయి మాస్టర్‌ప్లాన్‌లో భాగంగా త్వరలోనే ఈ రైల్వేలైన్ నిర్మించబోతున్నట్లు కేంద్రం రాష్ట్రానికి సమాచారమిచ్చింది. దీంతో గూడూరు – రేణిగుంట స్టేషన్ల మధ్య దాదాపు 83.17 కిలోమీటర్ల దూరం మేర కొత్త రైల్వేలైన్ ఏర్పాటు కానున్నట్లు సమాచారం. ఈ నిర్మాణంలో భాగంగా 36.5 హెక్టార్ల భూమిని సేకరించబోతున్నామని కేంద్రం తెలిపింది.

ఏదేమైనా ఈ కొత్త రైల్వేలైను కూడా అందుబాటులోకి వస్తే తిరుపతికి వెళ్లే ప్రయాణీకులకు ఎంతో సౌలభ్యంగా ఉంటుందనడంలో సందేహం లేదు!..




# కొత్త ప్రభుత్వానికి పెనుసవాళ్ళు!

(మొదటిపేజీ తరువాయి)

ఖాతాలలో లక్షల కోట్లు జమ చేశారు. కొన్ని వర్గాలని సోమరిపోతులను చేసేశారు. ఖజానా ఖాళీ చేసి ఘోర పరాభవంతో 2024లో ఓటమిపాలయ్యారు.

## 2024 నుండి...!

ఇప్పుడు మళ్ళీ బాబు & కోకి ప్రజలు బ్రహ్మరథం పట్టారు. ఏకంగా 164 సీట్లిచ్చి అఖండ విజయం చేకూర్చారు. అందులోనూ చంద్రబాబు ఒక్కరినే 135 స్థానాలతో ఆశీర్వదించారు. రాష్ట్రంలో అభివృద్ధి ఆనవాళ్లే లేకుండా చేసిన గత ప్రభుత్వ తప్పిదాలను సరిచేసే అవకాశం ఇప్పుడు బాబుకి లభించింది. చంద్రబాబుకి రాజకీయాలు కొత్త కాదు. పాలనా అనుభవం తక్కువేమీ కాదు. ఆయన ఇప్పుడు నాలుగవసారి ముఖ్యమంత్రి స్థానంలో కూర్చున్నారు. గతంలో పద్నాలుగున్నర సంవత్సరాలు పాలించిన అనుభవం ఉంది. అందులో తొమ్మిదిన్నర సంవత్సరాల కాలం ఏకధాటిగా ఉమ్మడి రాష్ట్రాన్ని పాలించిన ఘనత కూడా ఆయన సొంతం. ఇక కాలయాపన మంచిదికాదు. కక్ష సాధింపులు అవసరంలేదు. దుర్మార్గపు దోపిడీలకు తావు లేకుండా అభివృద్ధిపై బాబు దృష్టిపెట్టాలి. ఆంధ్రా ప్రజలు ఆయనపై పెట్టుకున్న నమ్మకాన్ని వమ్ముకానీయకుండా అనాధాంధ్రని స్వర్ణాంధ్రగా తీర్చిదిద్ది దేశంలోని ఇతర రాష్ట్రాలకి ఆదర్శంగా నిలపాలి. తన ముందున్న పెనుసవాళ్ళని తన గుప్పెట్లో ఉన్న కేంద్రప్రభుత్వ సహాయంతో అధిగమించాలి.

## ప్రత్యేకహోదా సాధనకు ఇదే మంచి తరుణం!

"పార్లమెంటులో 25కి 25 స్థానాలూ మనమే తెచ్చుకున్న తర్వాత, కేంద్రంలో ఎవరు ప్రధానమంత్రి కావాలనుకున్నా, వాళ్ళకి మనం చెప్పబోయేది ఒక్కటే, ఎప్పుడో ఏదో చేస్తామంటే మేం నమ్మం. రాష్ట్రానికి ప్రత్యేకహోదాపైన సంతకం పెట్టు, ఆ తర్వాతే మేం మీకు మద్దతిస్తాం, అని చెప్దాం.. రాష్ట్రానికి ప్రత్యేకహోదా ఎలా రాదో చూద్దాం..."

గతంలో వై.యస్.జగన్‌మోహన్‌రెడ్డి తాను ముఖ్యమంత్రి కావడానికి ముందు చెప్పిన మాటలివి. ఆ మాటలు విన్న ఆంధ్రా ప్రజలు 2019లో జగన్‌కు 22 పార్లమెంటు స్థానాలిచ్చారు. అయితే, ఫలితాలు వెలువడిన వెంటనే జగన్ మీడియా ముందుకొచ్చి "కేంద్రంలో మనతో పని లేకుండా ప్రభుత్వం ఏర్పడిపోయింది.. మనపై ఆధారపడి ఉంటే కేంద్రం మెడలు వంచి ప్రత్యేకహోదా తెచ్చేవాడిని" అంటూ ప్రత్యేకహోదాపై చేతులెత్తేశారు.

అప్పుడు నిజంగానే జగన్‌కి ఆ అవకాశం రాలేదు.

## సమయం ఆసన్నమయింది మిత్రమా...!

బాబు బావమరిది బాలకృష్ణ నటించిన 'గౌతమిపుత్ర శాతకర్ణి' సినిమాలో ఒక డైలాగు ఉంది "సమయం లేదు మిత్రమా... రణమా శరణమా..?" అంటూ శత్రువులను హెచ్చరించే సన్నివేశం అది.

ఇప్పుడు ప్రస్తుత నవ్యాంధ్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడికి అలాంటి అవకాశమే వచ్చింది. కేంద్రంలో 400పై చిలుకు సీట్లలో గెలిచి, ఎవరి మద్దతు లేకుండా సొంత బలంతో అధికారంలోకి వస్తామనుకున్న కమలనాథుల ఆశలపై దేశ ప్రజలు నీళ్ళు చల్లారు. ఎన్డీఏ కూటమిలోని మిత్రపక్షాలపై నరేంద్రమోడీ ఆధారపడేలా చేశారు. అది ఎంతలా అంటే.. చంద్రబాబు ఒక్కరే ఎన్డీఏ నుండి బయటకి వచ్చి ఇండియా కూటమిలో చేరితే చాలు మోడీ ప్రభుత్వం కూలిపోయేంతలా.

దేశంలో ఇండియా కూటమికి 234 సీట్లు వస్తే, ఎన్డీఏ కూటమికి అన్నీ కలుపుకుంటే 293 సీట్లు దక్కాయి. బీజేపీ కేవలం 240 స్థానాలకే పరిమితమయ్యింది. ఈ దశలో మిత్రపక్షాలు అవసరం కనుక ఆ కూటమిలో బీజేపీ తర్వాత అత్యధిక పార్లమెంటు స్థానాలు గెలిచిన తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబును మోడీ చిద్విలాసంతో తన పక్కన కూర్చోబెట్టుకున్నారు. చంద్రబాబుకు అపరిమితమైన ప్రాధాన్యతను ఇచ్చారు. గతంలో 2014, 2019లలో ఎన్డీఏ అంటే బీజేపీనే అనే భ్రమలో మిత్రపక్షాలను పట్టించుకోని మోడీని ఈ ఎన్నికల్లో ప్రజలు హెచ్చరించినట్లుగా తీర్పు ఇచ్చారు. మిత్రపక్షాల ఆవశ్యకతను చాటిచెప్పారు. అధికార గర్వంతో దక్షిణాది రాష్ట్రాలను అసలు పట్టించుకోని బీజేపీ పెద్దలకి ఇప్పుడు ఆ రాష్ట్రాల పార్లమెంటు సీట్లతోనే అవసరమొచ్చింది.

ఇటువంటి పరిస్థితులలో కూడా చంద్రబాబు, రాష్ట్రానికి రావాల్సిన ప్రాజెక్టులు, నిధులను రాబట్టుకోకపోతే... ఇక ఆంధ్రరాష్ట్రం ఎప్పటికీ బాగుపడదు. ఇటీవల పోలవరం ప్రాజెక్టును సందర్శించిన చంద్రబాబునాయుడు, ఆ ప్రాజెక్టు పరిస్థితిని చూసి చలించిపోయారు. ఈ దుస్థితికి కేంద్రంలో అధికారంలోవున్న భాజపా కూడా ఒకరకంగా కారణమని చెప్పాలి. గత 5ఏళ్ళలో కేంద్రప్రభుత్వం పోలవరానికి దాదాపు 8వేల కోట్ల రూపాయలు మంజూరుచేస్తే, రాష్ట్ర ప్రభుత్వం రూ.1500 కోట్లు మాత్రమే ఖర్చు చేసిందని ఇప్పుడు లెక్కలు తేలుస్తున్నారు. మిగిలిన రూ.6500 కోట్లు ఏమైపోయాయో తెలీదు. కేంద్రం ఈ విషయాలను ఇంతకాలం ఎందుకు పట్టించుకోలేదో తెలీదు. ఇన్నాళ్ళూ తన దత్తపుత్రుడిగా చెప్పుకున్న జగన్ చేసిన పాపాలలో మోడీకి కూడా కొంత వాటా ఇవ్వక తప్పదు. ఇప్పుడు సమయం ఆసన్నమయింది. ఒకరకంగా చెప్పాలంటే రాష్ట్రానికి మంచి రోజులు వచ్చాయి. కేంద్ర ప్రభుత్వ రిమోట్ ఇప్పుడు మన చేతికి చిక్కింది. ఈసారైనా స్వప్రయోజనాలని పక్కనపెట్టి రాష్ట్ర ప్రయోజనాల కోసం ఈ ప్రభుత్వం పాటుపడాలి. కేవలం మంత్రి పదవులకే పరిమితం కాకుండా రాష్ట్ర అభ్యున్నతి కోసం శ్రమించాలి. అవసరమైతే కేంద్రంతో పోరాడి మన హక్కులు సాధించుకోవాలి!

## ఆనంకి అభినందనలు

రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రిగా పదవీ బాధ్యతలు చేపట్టిన అనంతరం తొలిసారిగా ఈ నెల 17న నెల్లూరుకు వచ్చిన సందర్భంగా ఆనం రామనారాయణరెడ్డి ని కలిసి శుభాకాంక్షలు చెప్తున్న అమ్మ ఫర్నిచర్స్ అధినేత గడ్డం సుధాకర్‌రెడ్డి.



## కామాక్షితాయి హుండీ ఆదాయం..
# రూ. 13.65 లక్షలు

బుచ్చిరెడ్డిపాళెం మండలం జొన్నవాడలోని శ్రీ మల్లికార్జున స్వామి సమేత కామాక్షితాయి దేవాలయానికి గత మే 27 నుంచి జూన్ 15వ తేది వరకు 21 రోజులకు గాను భక్తులు సమర్పించిన హుండీ కానుకల ద్వారా 13,65,038 రూపాయలు లభించాయని ఆలయ అధికారులు తెలిపారు. అన్నదానం హుండీలకు 97 రోజులకు గాను 1,59,517 రూపాయలు, బంగారువస్తువులు 163 గ్రాములు, 303గ్రాములా 800 మిల్లీగ్రాముల వెండి వస్తువులను భక్తులు హుండీల్లో సమర్పించుకున్నారని తెలిపారు.



# తెలుగు వెలుగు

జర్నలిజం రంగంలో అక్షరానికి ప్రాణం పోసి
అక్షయ దివిటీ వెలిగించిన నిఖార్సయిన
జర్నలిస్టు... నిరుపమాన హ్యూమనిస్టు!
మేఘాల్లో విహరిస్తున్న వార్తలను
భూమార్గం పట్టించిన దార్శనికుడు
వార్తకు ఊపిరిపోసి స్వేచ్ఛనిచ్చి
రాజసం సృష్టించిన అక్షర బ్రహ్మ ఆయనే
నిబద్ధతకు, నిర్మాణాత్మకతకు పట్టం కట్టిన
అక్షర ఋషి, జీవన తపస్వి ఆయనే
జగానికి సూర్యోదయంతో తెల్లారితే
జనానికి ఉషోదయపు 'ఈనాడు'తోనే
తెలతెలవారుతుంది.
అక్షరాలకు తెలుగుతనం నేర్పిన
తెలుగువారి నిలువెత్తు సంతకం ఆయనే
బహుముఖప్రజ్ఞకు, స్థితప్రజ్ఞతకు
ఆనవాలుగా ఎదిగిన అక్షర కృషీవలుడు ఆయనే
కాంగ్రెస్ కపాలమోక్షం నుంచి
'తెల్లారితే తెలుగోడిదే రాజ్యం' అని అన్న
నందమూరి జన కవాతుకు
మార్గదర్శనం వహించిన మహోన్నతుడు
కలం బలం తెల్పిన కలం యోధుడు
నిరుపేదల గుండెల్లో నివసించి
దారి చూపిన దీపధారి అతడే
ఈనాడు వార్తంటే నిలువెత్తు నిజం
ఆయన దారంతా నిజాల ఇజం
వరదల్లో మునిగిన ప్రజల్ని ఆదుకున్నా
పొదుపు కోసం మార్గదర్శియైనా
ప్రజా సంక్షేమమే ఆయన తారకమంత్రం!
అవినీతిపై అరాచకత్వంపై సమరశంఖారావం విన్పించి
ప్రజా ప్రభుత్వాల్ని పీఠమెక్కించిన
ధీశాలి ఆతడే... ప్రజ్ఞాశాలీ ఆతడే
శ్రీశ్రీ తనువు చాలించిన వైనాన్ని
మహాభినిష్క్రమణం చేసిన
అక్షరసూర్యుడూ ఆయనే
అతడో నిలువెత్తు ఉద్యమకెరటం
జనకేతనమై, నవకేతనమైన సూత్రధారి
పత్రికలకు కొత్త భాష, భాష్యం చెప్పిన మేధావి!
ఈనాడంటే ప్రాణవాయువు
ఈనాడొస్తేనే ఉషోదయం
తెలుగువారికి ప్రాణ సమానం
నాడైనా.. నేడైనా ఈనాడుదే సామ్రాజ్యం!
అందరిచేతా ఆప్యాయంగా రాజీలేక 'జీ'
అని పిలుపించుకొన్న అక్షరఋషి
సెలవంటూ వెళ్ళిపోయాడు
ఆ అక్షరదీపం వెల్లుల్లో పుడమి
ప్రకాశిస్తూనే ఉంటుంది..!
ప్రజాహృదయాల్లో ఆ రూపం
భాసిస్తూనే ఉంటుంది!!



- చిన్ని నారాయణరావు
9440202942



## జ్వాలాముఖి అమ్మవారిని దర్శించుకున్న సోమిరెడ్డి

సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ఈనెల 15న తోటపల్లిగూడూరు మండలం వరిగొండలో వెలసివున్న శ్రీ జ్వాలాముఖి అమ్మవారిని దర్శించుకున్నారు. అమ్మవారి ఉత్సవాలను పురస్కరించుకుని పట్టువస్త్రాలను సమర్పించి, ప్రత్యేకపూజలు చేశారు. ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో ఆయన్ను స్వాగతించి అమ్మవారి వద్ద పూజలు చేయించి ఆశీర్వదించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తిరుమల శ్రీ వేంకటేశ్వరస్వామి, శ్రీ జ్వాలాముఖి అమ్మవారు, గొలగమూడి భగవాన్ శ్రీ వెంకయ్య స్వామి వారి అనుగ్రహం వల్ల రాష్ట్రంలో అరాచక పాలన అంతమైందన్నారు. ఎన్డీఏ కూటమి విజయంతో, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సారధ్యంలో రానున్న రోజుల్లో రాష్ట్రానికి మంచి భవిష్యత్తు ఉంటుందన్నారు. అమ్మవారి ఆశీస్సులతో ప్రజలంతా ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో ఉండాలని కోరుకుంటున్నానన్నారు. తొలుత ఆయన్ను మాజీ సొసైటీ అధ్యక్షుడు కోడూరు శ్రీనివాసులురెడ్డి (చిన్న బాబిరెడ్డి) ఆధ్వర్యంలో స్థానిక తెలుగుదేశం నాయకులు, కార్యకర్తలు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బొమ్మి సురేంద్ర, నాయకులు సన్నారెడ్డి సురేష్‌రెడ్డి, మునుకూరు రవికుమార్‌రెడ్డి, కర్పూరం శ్రీనివాసరెడ్డి, జానా శ్రీనివాసులుగౌడ్, ముత్యాల శ్రీనివాసులుతో పాటు జనసేన అధ్యక్షుడు సందీప్ తదితరులు పాల్గొన్నారు.

# రక్తదాతలంటే ప్రాణదాతలే!

### --- నెహ్రూ యువకేంద్ర అధికారి మహేంద్రరెడ్డి ---



రక్తదాతలంటే ప్రాణదాతలేనని, ఆపదలో ఉన్నవారికి రక్తదానం చేసి ప్రతిఒక్కరూ ప్రాణదాతలుగా నిలవాలని నెహ్రూ యువకేంద్ర జిల్లా అధికారి ఆకుల మహేంద్ర రెడ్డి యువతకు పిలుపునిచ్చారు. ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా నెల్లూరులోని పినాకిని యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు మురళీమోహన్‌రాజు ఆధ్వర్యంలో ఇటీవల టౌన్‌హాలు ప్రాంగణంలోని జా.రేబాల లక్ష్మీనరసారెడ్డి స్మారక భవనంలో పలువురు రక్తదాతలకు 'ప్రాణదాత' అవార్డులిచ్చి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రక్తదానం విశిష్టతను వివరించారు. అనంతరం పురస్కార గ్రహీతలు ఎం.మధుసూదన్‌రావు, పి.కిరణ్‌కుమార్‌రెడ్డి, డి.జీవన్‌కుమార్, పి.ముత్తు, ఎం.శరత్ కుమార్, గొట్టిపాటి నిర్మల, కె.వెంకటసుబ్బారావు, డాక్టర్ చీదరాల చెన్నయ్య, టి.లక్ష్మీ నారాయణ, షేక్ గులాంహుస్సేన్, దూబిశెట్టి కళ్యాణిలను ఈ ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో 'దిశ' సర్కిల్ ఇన్స్పెక్టర్ ఎన్.రామారావు, అందే శ్రీనివాసులు, ఎస్.వి రమేష్‌బాబు, షేక్ రియాజ్‌బాషా, కె.మురళీమోహన్‌రాజు, వై.చంద్రశేఖర్‌రెడ్డి, రవి గోగులపల్లి, చల్లా భారతిరెడ్డి, శ్రీకళరెడ్డి, మాధవి రెడ్డి, తమ్మినేని పాండు, కోడూరు శైలజ, రూపా రెడ్డి, రాచపాలెం రఘు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## దాతలకు ఫ్రెండ్స్ వాకర్స్ ధన్యవాదాలు



నెల్లూరులోని ఏసీ స్టేడియం ఫ్రెండ్స్ వాకర్స్ ఆధ్వర్యంలో ఈ నెల 16న మజ్జిగ చలివేంద్రం ముగింపు కార్యక్రమం జరిగింది. దాదాపు లక్షా 20వేల రూపాయల వ్యయంతో చలివేంద్రం నిర్వహించామని, గత నెల 22న వాకర్స్ 203 గవర్నర్ పలగాటి శ్రీనివాసులురెడ్డి ఆధ్వర్యంలో స్టేడియం క్రీడాకారులకు, పాదచారులకు మజ్జిగ ప్యాకెట్ల పంపిణీ ప్రారంభించామని అసోసియేషన్ ప్రతినిధులు తెలిపారు. అధ్యక్షులు బిరదవోలు రామమోహన్‌రెడ్డి, కార్యదర్శి నసీర్ అహమద్, కోశాధికారి శానంపూడి సుబ్బరాయుడు, వాకర్స్ ఇంటర్నేషనల్ కో-ఆర్డినేటర్ నలుబోలు బలరామయ్యనాయుడు, పత్తిపాటి రమణయ్య, వినుకొండ వెంకటేశ్వర్లు, మాగంటి ప్రసాద్‌నాయుడు, దొడ్ల జయరామ నాయుడు, పాల శంకరయ్య, కొండ్లూరు సుబ్బారావు, మన్‌మోహన్, కాగొల్లు శీనయ్య పాల్గొని దాతలకు ధన్యవాదాలు తెలిపారు.

## టూకీగా...



### కొడవలూరు ప్రసన్నాంజనేయునికి సముద్రజలాలతో అభిషేకం

కొడవలూరులోని శ్రీ ప్రసన్నాంజనేయస్వామికి జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఈనెల 17న స్వామివారికి సాగరజలాలతో వేడుకగా అభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారి సన్నిధిలో ప్రత్యేక హోమాలు చేశారు. ఉత్సవ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో జరిగిన ఈ ఉత్సవాల్లో పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు.

### గేదె అడ్డం రావడంతో ప్రమాదం.. వ్యక్తి దుర్మరణం

ఆదూరుపల్లి వద్ద నుంచి మోటార్‌బైక్‌పై ఇంటికి వెళ్తున్న కేశమనేనిపల్లికి చెందిన చీపినాపి పెంచలయ్య, దారిలో ఒక గేదె అడ్డం రావడంతో దాన్ని ఢీకొని కిందపడడంతో తలకు బలంగా దెబ్బతగిలింది. స్థానికులు వెంటనే ఆసుపత్రికి చేర్చగా, చికిత్సపొందుతూ మరణించాడు. కలువాయి మండలం వెరుబోట్లపల్లి గ్రామం వద్ద ఈనెల 17న ఈ ప్రమాదం జరిగింది.

### గన్నేపల్లిలో అడవి పేరంటాలమ్మ ఉత్సవాలు

ఉదయగిరి పరిధిలోని గన్నేపల్లిలో శ్రీ అడవి పేరంటాలమ్మవారి బ్రహ్మోత్సవాలు ఇటీవల వైభవంగా ప్రారంభమయ్యాయి. అందులో భాగంగా ఈనెల 17న మిట్టపల్లి నుంచి గౌడుగుల ఉత్సవం బయలుదేరి గడ్డంవారిపల్లి రామాలయానికి చేరుకుంది. అక్కడ అమ్మవారికి ప్రత్యేక నైవేద్యం సమర్పించారు. అనంతరం జరిగిన ఊరేగింపులో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

### మనుబోలులో గీత కార్మికుడికి గాయాలు

మనుబోలు కోదండరామపురానికి చెందిన గీత కార్మికుడు ఉప్పల వెంకటేశ్వర్లు తాటిచెట్టెక్కి, పట్టుతప్పి ప్రమాదవశాత్తూ కిందపడడంతో తీవ్రగాయాలు తగిలాయి. ఈనెల 17వ తేదీ సాయంత్రం ఈ ఘటన జరిగింది. నడుముకు బాగా దెబ్బ తగలడంతో ఆయన్ను బంధువులు చికిత్స కోసం వెంటనే గూడూరుకు తరలించారు.

### కోవూరు వద్ద కంటైనర్‌ను ఢీకొని..డ్రైవర్ మృతి

కోవూరు జాతీయ రహదారిపై ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో చిత్తూరు నుంచి హైదరాబాద్‌కు మామిడిపండ్ల లోడుతో వెళ్తున్న ఓ మినీవ్యాన్, రహదారిలో ఆగివున్న కంటైనర్‌ను ఢీకొనడంతో మినీవ్యాన్ డ్రైవర్ సతీష్ అక్కడికక్కడే మృతి చెందాడు. క్లీనర్‌కు గాయాలయ్యాయి. కోవూరు ఎస్ఐ రంగనాథ్‌గౌడ్ ప్రమాదస్థలాన్ని పరిశీలించి, కేసు దర్యాప్తు చేస్తున్నారు.

### వరికుంటపాడులో అంగన్‌వాడీ కేంద్రాలపై అవగాహన

మూడేళ్ళు నిండిన చిన్నారుల ఆరోగ్యానికి, వారి భవితకు బాసటగా ప్రభుత్వం నిర్వహిస్తున్న అంగన్‌వాడీ కేంద్రాలు ఎంతగానో ఉపయోగపడుతున్నాయని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని ఇటీవల ఆ సిబ్బంది ప్రజలకు అవగాహన కలిగించారు. వరికుంటపాడు మండలం గువ్వాడి మెయిన్‌లో ఆమేరకు అంగన్‌వాడీ కార్యకర్త మేడిశెట్టి విజయలక్ష్మి ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు.

### ముదివర్తిపాళెంలో పోతురాజుస్వామి జాతర

ఇందుకూరుపేట మండలం ముదివర్తిపాళెం గ్రామంలో ఈనెల 17న ఎంతో కోలాహలంగా గ్రామప్రజల ఆరాధ్యదైవమైన శ్రీ పోతురాజుస్వామి జాతర కోలాహలంగా జరిగింది. ఆలయ అర్చకులు ఈ సందర్భంగా స్వామివారికి విశేష అలంకారాలు, ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. గ్రామస్తులు పెద్దఎత్తున తరలివచ్చి స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

### పడమటి కంభంపాడులో విద్యుత్ మోటారు చోరీ

అనంతసాగరం మండలంలోని పడమటి కంభంపాడు గ్రామంలో వెంకటరామయ్య అనే రైతు పొలంలో ఉన్న విద్యుత్ మోటార్‌ను ఎవరో దొంగలెత్తుకుపోయారు. ఈనెల 16వ తేదీ రాత్రి దొంగతనం జరిగినట్లు ఆ రైతు లబోదిబోమన్నాడు. బాధితుని ఫిర్యాదుమేరకు సోమశిల ఎస్ఐ సుబ్బారావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

# కృషితో నాస్తి దుర్భిక్షం!

ఆంధ్రప్రదేశ్ వైద్య ఆరోగ్య శాఖామాత్యునిగా
పదవీ బాధ్యతలు చేపట్టిన
నిత్య కృషీవలుడు, యువనాయకుడు
స్నేహాభిలాషి, సేవాభిలాషి
**సత్యకుమార్ యాదవ్** గారికి
ఆత్మీయ అభినందనలు.

– మనోజ్ నంబూరు



Edited, Published, Printed & Owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Magunta Layout, NELLORE-3. Cell: 9866314741. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Managing Editor : **T.BHARATHI REDDY,** Sub-Editor : **MADDURU SRINIVASULU.** e-mail: lawyerpatrika@gmail.com